J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12






THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 33 16.1.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# వివాదాలు రేపుతున్న విదేశీ పర్యటనలు




## ➜ సమాచారం లేకుండా టూర్లకు చెక్కేస్తున్న రాజకీయ నేతలు
## ➜ అధికారికమా..? స్వలాభమా..? అంతా గుంభనమే
## ➜ దోచుకున్నది దాచుకునేందుకే అంటూ విపక్షాల విమర్శలు

***ఎక్కడి నుంచి ఎక్కడికెళ్తున్నారో..? ఎవరెవరు వెళ్తున్నారో..? ఏ విషయంపై వెళ్తున్నారో..? తిరిగి ఎప్పుడొస్తారో..? ఎవ్వరికీ తెలియదు. అసలు వాటికి సంబంధించి వివరణ ఇచ్చే నేతకానీ, అధికారి కానీ ఉండరు. ఇదంతా ఎవరిగురించో ఇప్పటికే అర్థమై ఉంటుంది కదూ..! అదేనండీ దేశంలో ప్రజాప్రతినిధుల పేరుతో చెలామణి అవుతూ, ప్రజల సొమ్ముతో టూర్లు తిరిగేస్తున్న మన రాజకీయ నేతల గురించే. గతంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అధికారులు విదేశీ పర్యటనలు ముందస్తుగా నిర్ణయించి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మాత్రమే జరిగేవి. కానీ ప్రస్తుతం అవి అత్యంత గోప్యంగా జరుగుతున్నాయి. ఫలితంగా మన నేతలు ఏ దేశంలో ఉన్నారో, ఎందుకెళ్లారో తెలుసుకోవడం ప్రజలకు జవాబు దొరకని చిక్కు ప్రశ్నగా మారుతోంది.***

### దేశవ్యాప్తంగా ఇదే తంతు!

జాతీయ స్థాయిలో నేతల పర్యటనలకు సంబంధించిన అంశాలను ఓసారి పరిశీలిస్తే, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి పర్యటనలన్నీ దాదాపుగా ముందస్తుగానే నిర్ణయం అవుతాయి. అయితే జాతీయ ప్రాధాన్యత, భద్రత, అంతర్జాతీయ వ్యవహారాలకు సంబంధించిన నిబంధనలు తదితర కారణాల వల్ల వీరి పర్యటనలను చివరి నిమిషం వరకు గోప్యంగా వుంచి పూర్తిస్థాయిలో సంసిద్ధం అయిన తర్వాతే ప్రకటిస్తుంటారు. ఇక కేంద్రమంత్రులు, ఇతర ఉన్నతాధికారులు కూడా షెడ్యూల్ ప్రకారమే విదేశాలకు వెళుతుంటారు. ఒకవేళ వ్యక్తిగత పర్యటనలున్నా, వాటి వివరాలను సంబంధిత భద్రతా విభాగాలకు, విదేశాంగ శాఖకు తెలియజేస్తారు. అయితే, రాష్ట్రాల విషయానికి వచ్చినప్పుడు, ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉండే చోట, అటు ప్రభుత్వ పెద్దలకు, గవర్నర్‌లకు, జాతీయ భద్రతా సంస్థలకు పొసగక వివాదాలు రేగుతుంటాయి. ఎందుకంటే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ దేశంలో ఎక్కువసార్లు విదేశీ పర్యటనలు చేసే నేతగా ఇప్పటికే విమర్శలు మూటకట్టుకున్నారు. ఆయన తరచూ తన భద్రతను పర్యవేక్షించే సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులకు సైతం కనీస సమాచారం ఇవ్వకుండా విదేశ విమానాలు ఎక్కేస్తుంటారనే వ్యాఖ్యలు తరచూ వినిపిస్తుంటాయి. దీనిపై సీఆర్‌పీఫ్ అధికారులు అధికారికంగా కేంద్రానికి ఫిర్యాదు కూడా చేశారంటే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. చివరికి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు సైతం హాజరు కాకుండా ఆయన విదేశీ పర్యటనలకు వెళ్లిన సందర్భాలు అనేకం. అలాగే దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీకి మైలేజ్ తీసుకొచ్చి ఆయన ఇమేజ్‌ను అమాంతం పెంచిన 'భారత్ జోడో యాత్ర' సమయంలోనూ విరామం పేరుతో ఆయన విదేశ యాత్రలకి వెళ్లారంటూ బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించడం తెలిసిందే.

### తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే..!

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ విదేశీ పర్యటనలకు వెళ్లారు. అయితే వారు ఏఏ దేశాలకు వెళ్లారు..? ఎందుకు వెళ్లారు..? విహార యాత్రకు వెళ్లారా..? వైద్య పరమైన చికిత్సల కోసం వెళ్లారా..? పెట్టుబడులను ఆహ్వానించేందుకు పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారా..? ఇలా బోలెడు జవాబులు దొరకని ప్రశ్నలకు వారి విదేశ పర్యటనలు వేదికయ్యాయంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే సాధారణంగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు, మంత్రి హోదాలో ఉన్న లోకేష్ చేసే పర్యటనలు, వారు నిర్వహించే సమావేశాలు

2లో





*తెలుగంటే అంతులేని ఆత్మీయతతో..మాతృభాష పట్ల ఎనలేని మమకారంతో ఉంటూ, తెలుగుజాతి శ్రేయస్సు కోసం, తెలుగు సంస్కృతి వికాసం కోసం నిరంతరం పరితపించే మన సింహపురి ముద్దుబిడ్డ..భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పే ప్రతి మాటా..తెలుగు భాషకు వెలుగుబాట వేస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. తెలుగు భాష ఉచ్ఛారణలో మేటిగా..తెలుగుతనం ఉట్టిపడే వస్త్రధారణలో ధీటుగా..ఎల్లప్పుడూ చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే మానవీయమూర్తిగానే కాక..తెలుగువారి జయపతాకగా..భారత కీర్తిపతాకగా ఆయన ఖ్యాతి తెలియనిదెవరికి?..ఆయన ఏ సభకు వెళ్ళినా తెలుగు మాటల మధురిమలే వినిపిస్తాయి. ఆయన మాట్లాడుతుంటే అమ్మభాషకి, తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకి పట్టం కట్టినట్లుంటుంది. తెలుగుతల్లికి తన మాటల సుమ మాలలతో పట్టాభిషేకం చేస్తున్నట్లనిపిస్తుంది. అందుకే ఆయన మాటలు తెలుగు వెలుగుకు దీపికలవుతాయి. ఇటీవల గుంటూరులో జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ప్రసంగం ఆద్యంతం అద్భుతం. పదహారణాల మన తెలుగు వెలుగుల పరిరక్షణ కోసం ఆయన పదహారు సూత్రాలను సూచించడం ఒక గొప్ప విశేషం. ఆ సూత్రాలను ఆచరించడం తెలుగువారి కర్తవ్యం. ఎంతో స్ఫూర్తిదాయకమైన ఆయన ఉపన్యాసంలోని సారాంశాన్ని..ఆయన మాటల్లోనే తెలుసుకుందాం!...*

# మన వెంకయ్య మాట.. తెలుగుకు వెలుగు బాట

## ➤ పదహారణాల 'తెలుగు' పరిరక్షణకు పదహారు సూత్రాలు

**భా**ష..అనేది మానవ సంబంధాల అభివృద్ధి క్రమంలో ఏర్పడిన వ్యక్తీకరణ. ఈ వ్యక్తీకరణను అత్యంత సహజమైన రీతిలో, సుందరంగా, వీనుల విందుగా తెలిపే భాషల్లో తెలుగు భాషకు ప్రథమ తాంబూలం లభిస్తుంది. అందుకే అత్యంత ప్రాచీన మయినదైనప్పటికీ తెలుగు భాష వేల సంవత్సరాలుగా సజీవంగా ఉంది. అందుకు ఎందరో మహానుభావులు కారకులయ్యారు. భాష ప్రాధాన్యత తగ్గితే దాని చుట్టూ ఉన్న వేలాది సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు కూడా క్రమంగా తెరమరుగవుతాయి. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఇప్పటినుంచే జాగ్రత్త వహించాలి. భాష పరిరక్షణను మనందరి బాధ్యతగా స్వీకరించాలి.

**తెలుగు వెలుగుల పరిరక్షణకి.. ఆ 16 సూత్రాలు ఇవే:**

1. తెలుగు వారి వారసత్వం, సాహిత్య సంప్రదాయాలు, జానపద సంస్కృతిని తక్కువ చూపు చూడవద్దు. తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులను గౌరవించాలి. మాతృభాషలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. మన సంస్కృతి, కళల పట్ల పిల్లల్ని ప్రోత్సహించడం, మన భాషను నేర్పడం నేటి తక్షణావసరం.

2. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో విద్యాబోధన మాత్రమే కాదు, తెలుగు భాషలో శాస్త్ర గ్రంథాలు తగినన్ని రావాలి. శాస్త్రీయమైన, సాంకేతిక పదాలను అర్థం చేసుకోగల నిఘంటువులు రావాలి. సాంకేతిక విద్యలో మాతృభాషల వినియోగం పెరగాలి.

3. ప్రతి ఒక్కరూ ఇంట్లో తమ కుటుంబసభ్యులతో తెలుగులో మాట్లాడినప్పుడే తెలుగు భాష సజీవంగా ఉంటుంది. ఇద్దరు తెలుగు వారు ఎదురైనప్పుడు తప్పనిసరిగా తెలుగు భాషలోనే మాట్లాడుకోవాలి. ఆంగ్ల భాషను నేర్చుకోవచ్చు కానీ తెలుగు భాషను నిరాదరించకూడదు. తెలుగులో మాట్లాడినంత మాత్రాన పరాయిభాషను ద్వేషించకూడదు. భాషా ద్వేషం మరింత అనర్థ దాయకం.

4. ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికీ, ప్రభుత్వ అభిప్రాయాలు ప్రజలకు మాతృభాషలోనే వ్యక్తం కావాలి. అంటే ప్రజల భాష, ప్రభుత్వ భాష అంటే పరిపాలనా భాష ఒక్కటే కావాలి. న్యాయస్థాన కార్యకలాపాలు, తీర్పులు మాతృభాషలో అందించేందుకు ప్రయత్నాలు జరగాలి. ప్రభుత్వ స్థాయిలో అమలు చేస్తున్న పథకాల పేర్లు తెలుగులో అందరికీ అర్థమయ్యే భాషలో ఉండేలా చూడాలి.

5. ఇతర భాషా పదాలు తెలుగు భాషలో సహజంగా ఇమిడిపోతే వ్యతిరేకించకూడదు. కొత్త పదాల సృష్టికి ప్రయత్నాలు చేయడంలో తప్పు లేదు, కానీ పనిగట్టుకుని గ్రాంథిక భాషను వాడడం సరైంది కాదు. మనం మాట్లాడే భాష సజీవంగా ఉండేలా, అందరికీ అర్థమయ్యే పదాలు వాడేలా ప్రామాణిక నిఘంటువును తయారు చేసుకోవాలి.

6. తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లో అనువాదమయ్యేలా చొరవ తీసుకోవడం. ఇతర భాషా సాహిత్యాన్ని తెలుగులో లభ్యమయ్యేలా చూడడం నిరంతరం సాగుతూ ఉన్నప్పుడే దేశంలో ప్రాంతీయ భాషలు మనుగడ సాగిస్తాయి.

7. సాంకేతికంగా కంప్యూటర్లలో తెలుగు భాష వినియోగాన్ని పెంచడం ద్వారా నేటి యువతకు తెలుగు పట్ల ఆసక్తి పెరుగుతుంది. అదే సమయంలో అందమైన తెలుగు ఫాంట్‌ల వినియోగం విషయంలో చొరవ తీసుకోవాలి.

8. వారంలో ఒక రోజును మాతృభాష కోసం కేటాయించినా భాష సజీవంగా ఉంటుంది. ఇవాళ తెలుగురోజు అని కుటుంబంలో ప్రతిఒక్కరూ అనుకోవాలి. మనం తెలుగువారం.. మనకు కావాలి "తెలుగు వారం". ఎలాగైతే వినోదం కోసం ఆదివారం లాంటి రోజులను కేటాయించుకున్నామో, అదే విధంగా భాష కోసం ప్రత్యేకమైన రోజును కేటాయించుకోవడం అవసరం.

9. తెలుగు పదాల నిఘంటువు ఇంట్లో ఉంచి, పిల్లలకు అర్థాలు తెలుసుకునే అలవాటు చేయాలి. పిల్లలకు అర్థమయ్యేలా నిఘంటువుల రూపకల్పన జరగాలి. రోజూ పిల్లలకు కథలు చెప్పడం, పద్యాలు నేర్పించడం ద్వారా తెలుగులో వారు సందేహాలు వ్యక్తం చేయడాన్ని ప్రోత్సహించాలి. కూచిపూడి, భరతనాట్యం, తెలుగు జానపద నృత్య ప్రత్యేకతల గురించి పిల్లలకు నేర్పాలి. రోజుకు ఓ 30 నిముషాల నుంచి గంటసేపు 'ఆటవిడుపు' పేరుతో తెలుగుకు సమయం కేటాయించుకునే ప్రయత్నం చేయాలి.

10. తెలుగు వార్తా పత్రికలు, పిల్లల పత్రికలు, బాలల బొమ్మల రామాయణ, మహాభారతాలు పిల్లల చేత చదివించాలి. తెలుగు భాషకు సంబంధించిన మహనీయుల గురించి పిల్లలకు తెలియజేయాలి. ఆటపాటలతో భాషను నేర్పించే సృజనాత్మక పద్ధతులను అన్వేషించాలి.

11. పెళ్ళిళ్ళలో శుభలేఖల దగ్గర్నుంచి భాషకు ప్రాధాన్యత పెంచాలి. పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు పుస్తకాలను బహుమతులుగా ఇవ్వడం సంప్రదాయంగా మార్చాలి. ముఖ్యంగా పుట్టినరోజుల్ని మన సంప్రదాయ పద్ధతుల్లో చేసుకునేలా పిల్లల్ని ప్రోత్సహించాలి.

12. గ్రంథాలయ సంస్కృతిని పెంపొందించాలి. ప్రతి ఇంట్లో తెలుగు పుస్తకాలతో చిన్న చిన్న గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. మన సంస్కృతి కాని పుష్పగుచ్ఛాల బదులు మంచి పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం అలవాటు చేసుకోవాలి, చేయాలి.

13. నలుగురు తెలుగువారు చేరే దేవాలయాల్లో తెలుగు భాష వినియోగం మరింత పెరగాలి. మన పండుగలు, వ్రతాలు, పేరంటాలకు ప్రాధాన్యతనిచ్చి నలుగురిని పిలిచినప్పుడు మన సంస్కృతే కాకుండా మన భాష కూడా ప్రాణప్రదంగా మారుతుంది.

14. తెలుగు వంటకాలు, పచ్చళ్ళు, ఆహారపుటలవాట్లు, సజీవంగా ఉంచాలి. మన భోజనం, ఫలహారాల పేర్లు నేటి తరానికి తెలియాలి.

15. మన కట్టు, బొట్టు గురించి నేటి తరానికి తెలియాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏ దుస్తులు ధరించినా, మనదైన వస్త్రధారణను ప్రోత్సహించాలి. ముఖ్యంగా పండుగ వేళ మన దుస్తులు, ఆభరణాలు ధరించేలా స్ఫూర్తి నింపాలి.

16. ప్రధానంగా చదువంటే ఇంగ్లీషేనన్న అభిప్రాయం మన మనసుల నుంచి దూరం కావాలి. మన నేలమీద మనం పరాయివారిగా జీవించే భావజాలం పనికిరాదు. ఇంగ్లీషు భాష లేకపోతే మనుగడే లేదనే భావ దాస్యం విడనాడాలి.

పదహారణాల తెలుగు వెలుగుల పరిరక్షణకు ఈ పదహారు సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో భాగం చేసుకోవాలి. అప్పుడు తెలుగు భాష పరిఢవిల్లుతుంది. తెలుగుజాతి తలెత్తుకు నిలబడగలుగుతుంది.

అమ్మ ఒడిలో, చదువుల బడిలో, బతుకు మడిలో, సంస్కారపు గుడిలో, గుండె తడిలో తెలుగు నుడి మన శ్వాస కావాలి. అమ్మభాష ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. తద్వారా వికసిత భారతం అవతరిస్తుంది. ఈ స్ఫూర్తిని తెలుగు వారంతా అందిపుచ్చుకుని తెలుగు భాష సంస్కృతుల పరిరక్షణకు నడుం బిగించాలని ఆకాంక్షిస్తున్నాను.

# వివాదాలు రేపుతున్న విదేశీ పర్యటనలు

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి. అయితే గత ఏడాది చివర్లో వచ్చిన పరమ పవిత్రమైన ముక్కోటి ఏకాదశి రోజున శ్రీవారి సేవను సైతం పెదబాబు, చినబాబులు పట్టించుకోలేదు. నాయకులు, ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పే అవకాశం కూడా ఇవ్వకుండా విదేశాలకు వెళ్లిపోయారు. తండ్రీ కొడుకులు రహస్య పర్యటనలుచేస్తూ ప్రజాధనాన్ని సొంతానికి వాడుకుంటున్నారంటూ ప్రతిపక్ష వైసీపీ నాయకులు ఆరోపణలు గుప్పించారు. దోచుకున్న రాష్ట్ర సంపదను దాచుకునేందుకే విదేశాలకు చెక్కేస్తున్నారంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు.

అంతేకాకుండా ప్రభుత్వం నుంచి కాంట్రాక్టులు, అయాచిత లబ్ధి పొందిన బినామీలు అందించే కమీషన్లు, సెటిల్‌మెంట్ల కోసమే చంద్రబాబు, లోకేష్ విదేశీ పర్యటనలకి వెళ్లారని దుమ్మెత్తి పోశారు. అయితే ఈ విమర్శలపై అటు స్టేట్ ఛీఫ్ సెక్రెటరీ కానీ డీజీపీ కానీ సాధారణ పరిపాలనా విభాగం కానీ స్పందించలేదు. పైగా తెలుగుదేశం పార్టీ నుంచి కూడా ఎవరూ ముందుకొచ్చి ఈ విషయంపై స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేయలేదనే విమర్శలు కూడా వినపడుతున్నాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మాత్రం ఓ నోట్ విడుదల చేసి చంద్రబాబు, లోకేష్ టూర్‌లకు సంబంధించిన సమాచారం పబ్లిక్ డొమైన్‌లోనే ఉందని, వారి టూర్‌లకు సంబంధించిన ఫొటోలు, భేటీ వివరాలు నిత్యం మీడియాలో వస్తూనే ఉన్నాయంటూ ముక్తసరిగా, తూతూ మంత్రంగా వివరణ ఇచ్చిందనే ఆరోపణలు కూడా వినిపించాయి. ఇక గత 18 నెలల కాలంలో చంద్రబాబు అధికారిక, వ్యక్తిగత పర్యటన నిమిత్తం 6 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, అంటే ప్రతి మూడు నెలలకొకసారి ఆయన ఫారిన్ టూర్లు వెళ్తూ ప్రజాధనాన్నివృధా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అలాగే విద్యాశాఖ మంత్రి లోకేష్ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 9 సార్లు విదేశీ పర్యటనలు చేశారని ఆ పర్యటనల ద్వారా ఎన్నిపెట్టుబడులు తెచ్చారో, రాష్ట్రానికి మేలు చేసే ప్రాజెక్టులు ఎన్ని తీసుకొచ్చారో చెప్పాలంటూ ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా అప్పుడప్పుడూ కనిపిస్తూ, అప్పుడప్పుడూ మాయం అవుతూ చిక్కడు దొరకడు తరహాలో రాజకీయాలు చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీ ఆరోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాల్లో విశేష అనుభవం గడించిన చంద్రబాబు, పాలనా పరమైన సంస్కరణలకు మరింత ప్రాధాన్యత ఇచ్చి, టూర్ల విషయంలో మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక తెలంగాణ రాష్టంలోనూ నేతల విదేశీ పర్యటనలు విమర్శలకు దారితీశాయి. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడులను ఆహ్వానించే పేరుతో మందీ మార్బలాన్ని వెంట తీసుకెళ్లారనే విమర్శలు వచ్చాయి. అలాగే తన సోదరుడు కొండల్‌రెడ్డిని కొందరు ఎంపీలతో కలిపి ప్రభుత్వ ధనం వెచ్చించి ఆస్ట్రేలియా ట్రిప్‌కి పంపించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒకరిద్దరు మంత్రులు సైతం చెప్పా పెట్టకుండా విదేశీ టూర్లు చేసొచ్చారనే ఆరోపణలు వినిపించాయి. గతంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన కుమార్తెను కలిసేందుకు లండన్ వెళ్లే పేరుతో, ఇతర దేశాలకు వెళ్లి తన వ్యవహారాలను చక్కబెట్టుకున్నారని అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు దుమ్మెత్తిపోశాయి. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరించిన వారు తమ వ్యక్తిగత పర్యటనలనే ప్రభుత్వ పర్యటనల పేరుతో ఎంజాయ్ చేశారనే విమర్శలు సైతం అనేకం వ్యక్తమయ్యాయి.

### సరిహద్దు రాష్ట్రాల్లోనూ రచ్చరచ్చే..

ఇక మనచుట్టూ ఉండే తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోనూ నేతల విదేశీ టూర్లు మూడు విమర్శలు, ఆరు ఆరోపణలు అన్నట్లుగానే సాగుతున్నాయి. తమిళనాడులో సీఎం స్టాలిన్, ఆయన కుమారుడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, ఇతర మంత్రుల ఫారిన్ టూర్లపై అటు తమిళనాడు బీజేపీ నాయకులతో పాటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నాయకుడు పళనిస్వామి కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. వేల కోట్ల రూపాయలను దేశం దాటించడంలో భాగంగానే స్టాలిన్ కుటుంబ సభ్యులతో కలిసి విదేశీ పర్యటనలు చేస్తున్నారంటూ ఆరోపించారు. ఇక కేరళలో ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, ఆయన మంత్రివర్గ సభ్యులు చెప్పాపెట్టకుండా విదేశాలకు వెళ్తున్నారని, వాటిపై కనీసం రాజ్‌భవన్‌కు సమాచారం కూడా ఇవ్వడం లేదని గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ ఏకంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి , కేంద్ర ప్రభుత్వానికి లేఖరాయడం గతంలో సంచలనం కలిగించింది. ఇక కర్ణాటక రాష్టంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా విదేశీ పర్యటనలు చేస్తూ ప్రభుత్వ ధనాన్ని పప్పుబెల్లాల్లా ఖర్చు చేస్తున్నారనే విమర్శలు రావడంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాష్టంలో మూడు నెలల పాటు మంత్రులు, ప్రభుత్వ అధికారుల విదేశీ పర్యటనలు రద్దు చేస్తున్నట్లు తాత్కాలికంగా ప్రకటించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో దేశంలోని ప్రభుత్వ పెద్దలు, బ్యూరోక్రాట్లు తమ పర్యటనలపై రహస్యం అనే ముద్రను చెరిపేసి, పారదర్శకంగా విజ్ఞతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అలాగే సాధారణంగా స్పెషల్ ఫ్లైట్‌లు, వెళ్లిన దేశాల్లో ఘనస్వాగతాలు, సభలు, సమావేశాలు, భేటీలు నిర్వహించి పబ్లిసిటీ చేసుకునే నాయకులు రహస్య పర్యటనలపై మాత్రం తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తుండడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఏదేమైనా విదేశీ పర్యటనలపై ప్రజలు బాహాటంగా ప్రశ్నించకపోయినా సామాజిక మాధ్యమాలలో మాత్రం నేతలను చెడుగుడు ఆడేస్తుండడం గమనార్హం...!

# పల్లె పండుగతో.. గ్రామాలకు సంక్రాంతి శోభ



సిమెంటు రోడ్డుకి ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి

జిల్లాలో పల్లెపండుగ ద్వారా గ్రామాల అభివృద్ధికి రూ.318 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 13న ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతసాగరం మండలం ఎగువపల్లి, మర్రిపాడు మండలం రాజుపాలెం, ఏఎస్‌పేట మండలం మదరాబాదు, కావలియడవల్లి, సంగం మండల కేంద్రంలో, చేజర్ల మండలం ఎన్వి కండ్రిగలో విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్లు, సిమెంటురోడ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజుపాలెం గ్రామంలో మంత్రి ఆనం మాట్లాడుతూ పల్లె పండుగతో గ్రామాలకు సంక్రాంతి శోభ వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో కూడా రహదారులు, మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 567 సీసీ రోడ్లకు 36.12 కోట్లు వెచ్చించామన్నారు. 172 గోకులాల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. జిల్లాలో దగదర్తి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కృషి జరుగుతోందని చెప్పారు. 900కోట్లతో విమానాశ్రయాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

### జలదానం చేస్తున్న విపిఆర్
**- మంత్రి ఆనం**

గ్రామీణ ప్రాంత ప్రజలకు జలదానం చేస్తున్న 'విపిఆర్ అమృత ధార' కార్యక్రమం ఎంతో మంచిదని మంత్రి ఆనం అన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుండడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈనెల 13న అనంతసాగరం మండలంలోని ఎగువపల్లి గ్రామంలో విపిఆర్ అమృత ధార ప్లాంట్‌లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ, ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ ఒక్కరోజే ఆరు ప్లాంట్లను ప్రారంభించడం శుభ పరిణామమంటూ విపిఆర్‌కి ఆనం ధన్యవాదాలు తెలియజేశారు.



## గౌరవపూర్వక కలయిక..!

భారత 13వ ఉపరాష్ట్రపతి, నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడిని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో ఈ నెల 13న గౌరవపూర్వకంగా కలిసి కొత్త సంవత్సరం మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు).

**• బీఎంఆర్ వితరణ**

# పోలీసులకు.. 5 బొలెరో వాహనాలు



జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లకి బొలెరో వాహనాలను అందజేస్తున్న బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర

నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయానికి సుమారు రూ.55 లక్షల విలువైన 5 బొలెరో వాహనాలను ఈనెల 13న రాజ్యసభ సభ్యులు..బీఎంఆర్ సంస్థల అధినేత బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) జిల్లా పోలీసు శాఖకు బహూకరించారు. పోలీసు శాఖ శాంతిభద్రతలను విజయవంతంగా పరిరక్షిస్తోందని, నేరాల నియంత్రణలో వారి సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీని కొనియాడారు. ఆ వాహనాలను కావలి నియోజకవర్గంలోని అల్లూరు, దగదర్తి, బిట్రగుంట, కావలి రూరల్ పోలీస్ స్టేషన్ మరియు కావలి రూరల్ సర్కిల్ ఆఫీసులకు కేటాయిస్తున్నామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా పోలీసుయంత్రాంగం చేస్తున్న సేవలను గుర్తించి సహకారం అందించిన బీద మస్తాన్‌రావుకు ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఆర్ సోదరుడు.. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి.. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, అడిషనల్ ఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## మట్టిపనుల పేరుతో కోట్లు దోచుకున్న మీకు..

# చంద్రబాబును విమర్శించే అర్హతే లేదు!

### వైసీపీ నేతలపై సోమిరెడ్డి మండిపాటు



కండలేరు డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు

నీటిపారుదలకి సంబంధించి మట్టి పనుల పేరుతో కోట్లాదిరూపాయలు దోచుకున్న మీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని విమర్శించే అర్హతే లేదని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైసీపీ నేతలపై ధ్వజమెత్తారు. ఈనెల 13న ఆయన జిల్లాలోని కండలేరు జలాశయం వద్ద రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుపై ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత, కూటమి పార్టీల నేతలతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలను ఏకరువు పెట్టారు. కోట్లు దోచుకునేందుకే గతంలో రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్ అన్నారని, ఆ దోపిడీ పూర్తికాగానే ఎన్జీటీ పేరుతో చేతులెత్తేశారని ఆయన వైసీపీ నేతలను దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడికి పేరొస్తుందని, ఉద్దేశపూర్వకంగా ముచ్చుమర్రి ప్రాజెక్టుపై అప్పట్లో వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చూపారన్నారు. నీటి యాజమాన్యంపై కనీస అవగాహన లేని వైసీపీ నేతలు ఇప్పుడు డ్యాంల వద్దకు చేరి రాజకీయ డ్రామాలు వేస్తున్నారంటూ విమర్శించారు. గతంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి నష్టంచేసే కుట్రకు వైసీపీ, జగన్‌రెడ్డి తెరలేపారని, అయితే ఆ ప్రయత్నాలన్నీ బెడిసికొట్టి అసలు నిజాలు బయటకు వచ్చాయని, అలా అనేక దుర్మార్గాలకు పాల్పడిన వైసీపీ నేతలు వచ్చి ఇప్పుడు చంద్రబాబునాయుడిని రాయలసీమ ద్రోహి అంటారా..అని ఆయన మండిపడ్డారు.

### నదుల అనుసంధానం ఎన్టీఆర్ పుణ్యమే...!

జలాశయాల చరిత్ర తెలియకుండా మాట్లాడితే ఎలా అని ఆయన అంటూ, మొదట నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని, తెలుగు గంగ ప్రాజెక్టుతో కృష్ణా-పెన్నా నదులను అనుసంధానం చేశారని, ఇందిరాగాంధీ సమక్షంలో ఎన్టీఆర్, ఎంజీఆర్ సంతకాలు చేసి ప్రాజెక్టు చేపట్టారని, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ 5 టీఎంసీల చొప్పున మద్రాసు ప్రజలకు నీళ్లు అందించేలా ఒప్పందం జరిగిందని ఆయన తెలుగుగంగ చరిత్రను ఈ సందర్భంగా విశదీకరించారు. దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇంజనీర్ శివరామకృష్ణయ్య సమష్టిగా కృషిచేసి మద్రాసుకు తాగునీరు, రాయలసీమకు సాగునీరు-తాగునీరు అందించేలా రూపకల్పన చేశారన్నారు. ఇంత చరిత్ర కలిగిన సోమశిల, కండలేరు జలాశయాల వద్దకు ఇటీవల సందర్శనల పేరుతో వైసీపీ నాయకులు వచ్చి ఎందుకు హడావిడి చేస్తున్నారో వారికే తెలియాలన్నారు. 146 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన సోమశిల, కండలేరు జలాశయాలు ఉమ్మడి ఏపీలోనే కాదు, బహుశా దేశంలోనే ఏకైక జిల్లా నెల్లూరు ఒక్కటేనన్నారు. ఆసియాలోనే అతిపెద్ద మట్టికట్ట కలిగిన డ్యాంగా మన కండలేరు ప్రఖ్యాతిగాంచిందని, ఈ రెండు జలాశయాలను సృష్టించిన గొప్పవ్యక్తి ఎన్టీఆర్ అనీ, వాటిని అభివృద్ధి చేస్తున్నది చంద్రబాబు అని వివరించారు. ఇంతటి చరిత్ర కలిగిన సోమశిల, కండలేరు జలాశయాల పేరెత్తే అర్హతే వైసీపీవారికి లేదన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

# సేవాతత్వం.. సమాజానికి మార్గదర్శకం!

**• వాకర్స్ గవర్నర్ బలరామయ్యనాయుడు**



వాకర్స్ 203-డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నలుబోలు బలరామయ్యనాయుడు

సేవాతత్వం సమాజ హితం కోరుకుంటుందని, సేవాభావమే సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుందని వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు చెప్పారు. నెల్లూరు-ప్రకాశం-గుంటూరు జిల్లాల వాకర్స్ నాయకునిగా..203-జిల్లా గవర్నర్‌గా ఆయన ఈనెల 11న నెల్లూరులోని కిలారి తిరుపతినాయుడు కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారం చేశారు. వాకర్స్ ఫస్ట్ లేడీగా ఆయన సతీమణి.. ఎన్.పద్మావతి పాల్గొన్నారు. ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్. పి.రవిరాజు ఆధ్వర్యంలో బలరామయ్యనాయుడు మూడు జిల్లాల గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బలరామయ్య నాయుడు మాట్లాడుతూ, 203-వాకర్స్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. తనను మూడు జిల్లాల వాకర్స్ గవర్నర్‌గా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు జిల్లాల వాకర్స్ సంఘాల నాయకులు, ప్రముఖులు బలరామయ్య దంపతులను సన్మానించారు. 2025 - జిల్లా గవర్నర్ పెద్ది శివరామ్‌ప్రసాద్, ఇంటర్నేషనల్ వాకర్స్-2017 ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కోనేటి రవిరాజు, మునికృష్ణ, ఎంవి సుబ్బారెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఏకొల్లు రాఘవరెడ్డి, రీజనల్ కౌన్సిలర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, షేక్ లాల్‌వజీర్, రాఘవేంద్ర శెట్టిలతో పాటు 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్ రెడ్డి, స్థానిక ప్రముఖులు వీరిశెట్టి హజరత్ బాబు, కళాంజలి అనంత్, బెనర్జీ, శింగంశెట్టి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లాయర్
జనవరి 16, 2026

# గ్రామ స్వరాజ్యం.. ప్రగతి పూజ్యం!

స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా.. మనదేశంలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మాత్రం నేటికీ సాకారం కావడం లేదు. జాతీయోద్యమ కాలం నుంచి గ్రామాభ్యుదయం మాట వినపడుతూనే ఉన్నా, ఇప్పటికీ దేశంలో అనేక గ్రామాలు అసలైన గ్రామస్వరాజ్యానికి దూరంగానే ఉంటున్నాయి. ఏ గ్రామం చూసినా సమస్యలమయమే. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారికి సైతం.. బతకడానికి జీవనాధారంగా ఉండే పల్లెల్లో ఇప్పుడు ఆ పల్లెజనమే పనులు లేక నగరాలకి పట్టణాలకి వలసలు పోతుండడం బాధాకరం. గతంలో పల్లెలు పచ్చదనానికి ప్రతీకగా, స్వచ్ఛమైన గాలులతో కాలుష్యానికి దూరంగా ఉండేవి. కులవృత్తులు, చేతివృత్తులతో హాయిగా జీవించేవారు. వ్యవసాయం, తోటల పనులు వంటి వాటితో నిత్యం శ్రమిస్తూ, అనేక రకాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తుండేవారు. అయితే, ఇప్పుడా పాతకాలమంతా మారిపోయింది. ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలోని అనేక రంగాలు కుదేలైపోయాయి. పాశ్చాత్య సంస్కృతి విజృంభిస్తూ, ఎంతో గొప్పవైన మన సంస్కృతి సంప్రదాయలు వెనుకబడిపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారిపోతున్నారు కానీ, గ్రామీణ ప్రాంతాల తలరాతలు మాత్రం మారడమే లేదు. నేతలు గ్రామాల అభివృద్ధిపై పెద్దగా దృష్టిసారించకపోతుండడంతో అవి నేటికీ కష్టాల కొలిమిలో కాగుతూనే ఉన్నాయి. మనదేశంలో గ్రామ పంచాయతీల వ్యవస్థ ఏర్పడి ఎంతో కాలమైనా, చాలా పంచాయతీల్లో వాటి నిర్వహణకు అవసరమైన నిధులు ఉండడం లేదు. గ్రామంలో కనీస సదుపాయాల కల్పనకు, అవసరమైన ఖర్చులకు ఏళ్ళ తరబడిగా ఎదురుచూడాల్సి వస్తోంది. గ్రామాల్లో ప్రజలకు నిత్యావసరాలైన తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రోడ్లు తదితర మౌలిక వసతులకు పుష్కలంగా నిధులు లేకపోవడం.. గ్రామపంచాయతీల వ్యవస్థకు ఒక పెద్ద శాపం. గ్రామాల్లో ఎక్కడ చూసినా మురుగుదిబ్బలు, చెత్తకుప్పలు ఎక్కువైపోయాయి. వాటిని సరైన సమయానికి తొలగించేవారు లేక, అనేక పల్లెల్లో ఆ చెత్తాచెదారమంతా రోడ్లమీదనే ఉంటోంది. ఫలితంగా దోమలు ప్రబలి, ప్రజలకి వ్యాధులు బాధలు సాధారణమైపోయాయి. కొన్ని చిన్న చిన్న పంచాయతీలైతే, కార్యాలయాలుంటాయి కానీ, అవెప్పుడూ మూసే ఉంటాయి. జీతాలు కూడా సక్రమంగా అందక సిబ్బంది ఇబ్బంది పడుతుంటారు. నాయకులు గ్రామాల మీద పెత్తనం కోసం చూస్తుంటారే తప్ప, వాటి అభివృద్ధిని మాత్రం పట్టించుకోరు. ఎప్పుడైనా ప్రభుత్వాలు కనికరించి నిధులు విదిలిస్తే.. అవి అటుచూసి ఇటు తిరిగేలోగా మాయమవుతుంటాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ ఏవో కొన్ని పంచాయతీలు మాత్రం ఎంతోకొంత బాగుంటున్నాయి తప్ప, అత్యధికశాతం పంచాయతీల్లో ప్రగతి పూజ్యంగానే ఉంది. కేంద్రప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులను కూడా పంచాయతీలకి ఇవ్వకుండా కొన్నిచోట్ల ప్రభుత్వాలు తమ చిత్తానుసారం వాటిని ఇతరత్రా పనులకు మళ్ళిస్తుండడం కూడా గ్రామాభివృద్ధికి అవరోధంగా ఉంటోంది. గ్రామాల్లో వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అత్యవసరమైన కార్యాలకు వెచ్చించాల్సిన డబ్బు, సక్రమంగా వ్యయమవుతోందో లేదో పర్యవేక్షించే నాథులు లేకపోవడం వల్ల పంచాయతీలకు ఈ దుర్గతి పడుతోంది. ఇటీవలి కాలంలో కేంద్రప్రభుత్వ పథకాలు అనేకం రాష్ట్రాల్లోకి వస్తున్నా, గ్రామాలకి సంబంధించి అందులో ఎన్నో పథకాలు ఉన్నప్పటికీ, వాటి అమలులోనూ స్థానికంగా ఉండే నాయకులు లేదా అధికారులు సక్రమంగా వాటిని ప్రజలకి ఉపయోగపెట్టడం లేదు. ఆధునిక కాలానికి తగ్గట్టుగా పంచాయతీలు ఎదగడం లేదు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి సదుపాయాలతో పాటు, ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు అందుబాటులో ఉండే వ్యవస్థను మరింత పటిష్టం చేస్తే తప్ప, ఈ దుస్థితి నుంచి గ్రామాలకి మోక్షం ఉండదు. గ్రామ పంచాయతీల బాగుకు కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శ్రద్ధ చూపించినప్పుడే గ్రామాలకి పురోగతి ఉంటుంది. గ్రామాల్లోని పంచాయతీలే స్థానిక ప్రభుత్వాలుగా మారాలి. రాజకీయ నాయకుల జోక్యం తగ్గాలి. గ్రామప్రజలకు ఏ పనులు అవసరమో వాటిని చేసేవిధంగా వ్యవస్థను ఆవిష్కరించుకోవాలి. గ్రామాల్లో ఎలాంటి సదుపాయాలు కావాలో గ్రామసభలో నిర్ణయించుకుని, ఆమేరకు ప్రభుత్వాల నుంచి నిధులను మంజూరు చేయించుకోవాలి. వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాభ్యుదయాన్ని సాకారం చేసుకోవాలి!...

## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 125

# పౌష్టికాహార లోపం.. బడుగు బాలలకి శాపం!

మొక్కకు సమృద్ధిగా నీరు పోసి సంరక్షిస్తేనే అది పచ్చని వృక్షంగా ఎదుగుతుంది. అదేవిధంగా, పిల్లలని కూడా పసితనం నుండే మంచి పౌష్టికాహారంతో పోషిస్తేనే వారి ఎదుగుదలతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. వారి మానసిక వికాసం కూడా మెరుగుపడుతుంది. అయితే, మనదేశంలో నేటికీ 17.20 కోట్లమందికి ఆరోగ్యకరమైన పౌష్టికాహారం లభించడం లేదని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వారిలో బడుగు వర్గాలకి చెందిన పసిపిల్లలే అత్యధికం అని కూడా గణాంకాలు చెప్తున్నాయి. సుదీర్ఘకాలంగా ఈ పౌష్టికాహార లోపం బాలల పాలిట పెనుశాపంగా మారింది. ఆహార ఉత్పత్తిలో మనదేశం ముందంజలో ఉన్నా, అత్యధిక శాతం ప్రజలకి మంచి పోషక విలువలున్న పండ్లు, పాలు, పప్పులు వంటి ఆహార పదార్థాలను పుష్కలంగా కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత ఉండడం లేదు. అనాదిగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికమే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. దీంతో, ఎదిగే పిల్లలకు సరైన ఆహారం, పోషణ అందుబాటులో లేక బాల్యం బక్కచిక్కిపోతోంది. మనదేశంలో అయిదేళ్ళలోపు పిల్లల్లో దాదాపు సగం మంది బక్కపలచగా, నీరసంగా ఉంటున్నారని, సరైన పోషకాహారం లేకపోవడమే అందుకు ప్రధాన కారణమని, ఆ మిగిలిన సగం మందిలోకూడా అత్యధికశాతం మంది ఊబకాయం, రక్తహీనత వంటి రకరకాల శారీరక-మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారని నిపుణుల నివేదికలు చెప్తున్నాయి. అంతేకాదు, సరైన ఎదుగుదల లేక ఎత్తుకు తగ్గట్లు బరువు లేని పిల్లలు మన దేశంలో కనీసం 19.3 శాతం మంది దాకా ఉన్నారని, డి-విటమిన్ లోపంతో 23.9 శాతం, జింక్ లోపంతో మరో 31.7శాతం మంది ఇలా అనేకరకాల సమస్యలతో బాలలు అవస్తలు పడుతున్నారని నిపుణుల అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

## చిన్నారులను చుట్టుముడుతున్న వ్యాధులు!

పౌష్టికాహార లోపం అన్నది నేరుగా మరణానికి తీయకపోయినప్పటికీ, రోగనిరోధక శక్తిని బాగా తగ్గించి, తద్వారా లేనిపోని జబ్బులతో బాలలను నీరసపరచి, చివరికి మరణానికి దగ్గర చేస్తుందని కూడా నిపుణులు చెప్తున్నారు. దేశంలో నానాటికీ పెరుగుతూ ఉన్న పేదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానం తదితర కారణాలతో కోట్లాదిమంది నిరుపేద కుటుంబాల జీవితాలు నేటికీ అత్యంత దుర్భరంగా ఉంటున్నాయి. కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా, నగరాలు, పట్టణాల శివార్లలో, సముద్ర తీరాలు, కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజనులు వంటి నిరుపేద కుటుంబాల్లో ఉన్న చిన్నారులు అనునిత్యం ఇలాంటి ఇబ్బందులని ఎదుర్కొంటూనే ఉన్నారు. వారి ఆరోగ్యసంరక్షణ పట్ల ఎవరూ తగినంత శ్రద్ధ తీసుకోకపోవడంతో, క్రమేణా బాలల మరణాలు కూడా పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పౌష్టికాహారం లోపం కారణంగా వ్యాధులను తట్టుకునే శక్తి లేకపోవడం, న్యుమోనియా, మలేరియా వంటి వ్యాధులు రావడం, వాటిని సరిగా గుర్తించి వైద్యం చేయించే స్థితిగతులు ఆయా కుటుంబాల్లో లేకపోవడం, అవి బాలలకు ప్రాణాంతకంగా మారడం తరచూ జరుగుతున్నాయని కూడా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గర్భిణులుగా ఉన్నప్పటినుండే జాగ్రత్తలు తీసుకోవాలి!

బిడ్డలు ఆరోగ్యంగా జీవించాలంటే కాబోయే తల్లులు, పుట్టబోయే శిశువు పట్ల అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలి. బిడ్డ ఎదిగే క్రమంలో అందుకు అనుగుణంగా పోషకాహారాన్ని ఇవ్వాలి. పోలియో వంటి వ్యాధులు రాకుండా సకాలానికి టీకాలు కూడా వేయించాలి. కానీ, మనదేశంలో గర్భిణి స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఇలాంటి వాటి పట్ల సరైన అవగాహన లేకపోవడం వ్యవస్థలో అతిపెద్ద లోపం. ఈ కారణంగా కోట్లాది మంది పిల్లలు పుట్టుకనుంచే నానా రకాల అనారోగ్యాలతో అల్లాడుతున్నారు. గర్భిణులు తాము తినే సాధారణ ఆహారమే కాకుండా ప్రత్యేకించి పౌష్టికాహారం తీసుకున్నప్పుడే బిడ్డలు కూడా ఆరోగ్యంగా పుడతారు. కానీ అనేకమంది తల్లులు, కాబోయే తల్లులు ఏపూటకి ఏది అందుబాటులో ఉంటే అది తినేస్తున్నారే తప్ప ప్రత్యేకించి పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవడం లేదు. దీంతో, కడుపులో బిడ్డలకి, పుట్టిన పిల్లలకీ మంచి ఆరోగ్యాన్ని అందివ్వలేకపోతున్నారన్నది నిపుణుల అభిప్రాయం.

ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి, ఎదుగుదలకి తల్లిపాలే దివ్యౌషధం. పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇస్తే ఆ శిశువుల ఆరోగ్యానికి అదే శ్రీరామరక్షగా ఉంటుంది. తల్లి తన పిల్లలకు కనీసం ఆరునెలల పాటు క్రమం తప్పకుండా పాలిస్తే తల్లీబిడ్డలిద్దరికీ కూడా జీవితాంతం పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలుంటాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా స్పష్టం చేస్తోంది. అంతేకాదు, పిల్లలకు రెండేళ్ళ వయసొచ్చేవరకైనా తగిన పౌష్టికాహారం, సమతులాహారం తినిపించగలిగితే పిల్లల్లో రోగనిరోధక శక్తి బాగా పెంపొందుతుందని కూడా సదరు సంస్థ చెప్తోంది. కానీ, మనదేశంలోని చాలామంది తల్లుల్లో నేటికీ అలాంటి అవగాహన ఉండడం లేదు. ప్రభుత్వాలు, తల్లీబిడ్డల సంరక్షణ కోసం ఎన్నో పథకాలను అమలుచేస్తున్నా, మారుమూల గ్రామాలు, పట్టణ, నగర శివారు ప్రాంతాల్లో ఉండే చిన్నారులకు వరకూ అవి చేరడంలేదు. పాలు, పాల ఉత్పత్తులు, పండ్లు, ఆకుకూరలు ఆరోగ్యాన్నందించే పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటివి అసలైన నిరుపేదల కుటుంబాల గడపల వరకు వెళ్లడంలేదు. ఇలాంటి పరిస్థితులన్నిటినీ ప్రభుత్వాలు ఇకనైనా ఆమూలాగ్రం పరిశీలించి, బాలల ఆరోగ్య సంరక్షణకు సరికొత్త కార్యాచరణ రూపొందించాలి. పకడ్బందీ ప్రణాళికలు రచించి అమలుచేయాలి."నేటి బాలలే రేపటి పౌరులన్న" విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వారి "ఆరోగ్యమే దేశానికి మహాభాగ్యం" అన్న ఆశయంతో పనిచేయాలి. అలాచేయని పక్షంలో బాలల ఆరోగ్యానికి రక్షణ, వారి భవితకు భద్రత రెండూ ఉండవన్న నిజాన్ని గ్రహించాలి.

"సర్వేజనా సుఖినోభవంతు...!"

- రాజశ్రీ

# పెద్ద తారల సినిమా టిక్కెట్ల రేట్లు పెంచడం దారుణం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

పాత రోజుల్లో కొత్త సినిమా విడుదలైతే బ్లాక్ టిక్కెట్ల దందా విపరీతంగా నడిచేది. ఇరవై రూపాయల టిక్కెట్టు బ్లాక్ టిక్కెట్టు విక్రయదారులు యాభై రూపాయలకి అమ్ముకునేవాళ్ళు. చట్టరీత్యా అది నేరం. అలా అమ్మినవాళ్ళని ఒకప్పుడు పోలీసులు అరెస్టు కూడా చేసేవారు. ఇప్పుడు అదే టిక్కెట్లని ఎగ్జిబిటర్లు రేటు పెంచి అమ్ముకోవడానికి ప్రభుత్వమే చట్ట భద్ధత కల్పించి బ్లాక్ దందాని ప్రోత్సహిస్తోంది. ఇటీవలి కాలంలో పెద్ద హీరోల సినిమాల టిక్కెట్లు మొదటి పదిరోజులూ రేట్లు పెంచి అమ్ముకోవడానికి ప్రభుత్వాలు అధికారికంగా జీఓలు ఇస్తున్నాయి. తాజాగా చిరంజీవి హీరోగా విడుదలైన 'మన శంకర వరప్రసాద్' సినిమా కోసం కూడా టిక్కెట్టు ధర పెంచి ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. విడుదలకి ఒకరోజు ముందుగానే సినిమా చూడదలుచుకున్న వారికోసం ప్రత్యేక ప్రదర్శన పేరుతో అనుమతి కూడా ఇచ్చింది. ఆ ప్రత్యేక షో టిక్కెట్టు ధరని ఏకంగా 500రూపాయలుగా నిర్ణయించింది. అలాగే 12వతేదీ నుండి పదిరోజుల పాటు 100 నుండి 125 రూపాయల వరకూ అదనంగా వసూలు చేసుకోవచ్చని సదరు జీవోలో పేర్కొంది. ఓ సినిమా హిట్టయితే నిర్మాతలు వందల కోట్లు లాభాన్ని ఆర్జిస్తున్నారు. అదంతా పక్కనపెట్టి ఇప్పుడు ఖర్చు భారాన్ని ప్రేక్షకులపైన కూడా వేస్తున్నారు. ఉన్నత న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేసి ఈ రేట్ల పెంపు దోపిడీని అడ్డుకోవాలి.

కే.నర్సిరెడ్డి, కావలి.

# సామాన్యులకి సైతం లభించిన వైకుంఠ ద్వార దర్శనం!

ఈసారి తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చాలా బాగా చేశారు. వీవీఐపీలకి ఓవైపు ప్రాధాన్యత కల్పిస్తూనే మరోవైపు సామాన్య భక్తులకి కూడా పెద్దపీట వేశారు. ఎంతో ప్రశాంతంగా, సామాన్య భక్తులకి ఎలాంటి వత్తిడి లేకుండా, ఎక్కడా ఒక్క చిన్న అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లని చేసిన పాలకమండలి మరియు అధికారులు నిజంగా అభినందనీయులు. గతంలో ఎప్పుడూ సామాన్య భక్తులకి ఇలాంటి భాగ్యం కలగలేదు. ఈసారి దర్శనాల విషయంలో కూటమి ప్రభుత్వం చూపించిన ప్రత్యేకశ్రద్ధ స్పష్టంగా కనిపించింది. పాలకులకి కూడా నా ప్రత్యేక అభినందనలు.

– డి.హరిత, గూడూరు.

# నెల్లూరుజిల్లాలోనే గూడూరు చాలా మంచి నిర్ణయం!

గూడురుని మళ్ళీ నెల్లూరుజిల్లాలోనే కలపడం చాలామంచి నిర్ణయం. గూడూరుకు ఒక విశిష్ట చరిత్ర వుంది. అక్కడ నుండి అనేకమంది ప్రముఖులు ప్రపంచస్థాయిలో ప్రాముఖ్యతని సంతరించుకున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా నెల్లూరుజిల్లా గూడూరుని కోల్పోయింది. నాయకుల కృషి, ప్రజల తిరుగుబాటుతో ప్రస్తుత ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుని గూడూరుని వెనక్కి తెచ్చి మళ్ళీ నెల్లూరుజిల్లాలో కలపడం స్వాగతించ తగ్గ విషయం.

విశాఖ గూగుల్ డేటా సెంటర్ వివాదాల సుడిగుండంలో చిక్కుకోవడం బాధాకరం. త్వరలో పరిష్కారం లభించి పనులు ప్రారంభమవుతాయని ఆశిద్దాం.

సీ.ఆర్.విశ్వేశ్వరరావు,
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

# జనవరి 9.. ఓ చరిత్రాత్మకమైన రోజు

## • ఎన్టీఆర్ పాలనను కొనియాడిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పక్కన అబ్దుల్ అజీజ్, ఆనం వెంకటరమణారెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

జనవరి 9వ తేది చరిత్రాత్మకమైన రోజని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు ప్రమాణస్వీకారం చేసిన ఆరోజు, దేశ రాజకీయాలలో నూతన శకానికి నాంది పలికిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి.. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జనవరి 9న టీడీపీ నాయకులు అబ్దుల్ అజీజ్, ఆనం వెంకటరమణారెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, పనబాక భూలక్ష్మి, పీఎల్ రావు, కప్పిర శ్రీనివాసులు, దర్శి హరి, హరిబాబు, రాఘవరెడ్డిలతో కలసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుజాతి ఖ్యాతిని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి సగర్వంగా చాటి, తెలుగుదేశం పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అదొక ప్రభంజనమై టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన శుభదినం.. జనవరి 9 అని చెప్పారు. 1983, జనవరి 9న నందమూరి తారక రామారావు ప్రభుత్వం నెలకొల్పి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్టీఆర్ పాలనలో కిలో 2 రూపాయలకే బియ్యం ఇచ్చారని, ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేశారని ఆయన అంటూ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఫైనాన్స్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సమాజంలోని అట్టడుగు వర్గాలను ఆదుకున్న ఘనత ఒక్క ఎన్టీఆర్‌కే దక్కిందని కొనియాడారు. 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటి నుండి నేటివరకు.. 43 ఏళ్ల ప్రజా ప్రస్థానంలో అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు ప్రజల పక్షాన నిలిచారని, అదేబాటలో ప్రస్తుతం నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని అన్నారు.

### జనవరి 27న...

### జిల్లావ్యాప్తంగా ఉచిత సైకిళ్ళ పంపిణీ

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు, భావితరాల భవిష్యత్తు నిర్మించేందుకు నారా లోకేష్ నాడు చేపట్టిన యువగళం పాద యాత్ర ప్రభంజనం సృష్టించి, రాష్ట్ర భవిష్యత్తును మార్చివేసిందని, రాష్ట్రంలో నలుదిశలా 226 రోజుల పాటు, 3132 కి.మీ.ల మేర అవిశ్రాంతంగా సాగిన యువగళం పాదయాత్రకు జనవరి 27తో మూడేళ్లు పూర్తి కానున్నాయని ఆయన తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్య అందించేందుకు శ్రమిస్తున్న నారా లోకేష్‌కు బాసటగా... జనవరి 27న జిల్లా వ్యాప్తంగా ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నామన్నారు.

### మే 28లోగా..

### అన్ని నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు

ఎన్టీఆర్ రాష్ట్ర ప్రజలకు చేసిన మహోపకార్యాలను స్మరించు కుంటూ ఈ ఏడాది మే 28 మహానాడు లోపు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నందమూరి తారక రామారావు విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆమేరకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో కూడా ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

# నెల్లూరు రూరల్‌లో జోరుగా అభివృద్ధి

## ➢ 204 పనులకు.. 27 కోట్లు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 204 పనులకు 27 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. రహదారులు, డ్రెయిన్‌లు, ప్రహరీ గోడలు, స్మశాన వాటికల అభివృద్ధి, విద్యుత్ పనులన్నీ ఈ నియోజకవర్గంలో పెద్దఎత్తున జరుగుతుండడం విశేషం. ఈ పనులను 51 రోజుల్లో పూర్తిచేసి రూరల్ ప్రజల చేత ప్రారంభింపజేసేందుకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. వీటికి సంబంధించి త్వరలోనే ఒక తేదీని నిర్ణయించి శంకుస్థాపనలు ఒకే రోజు చేయనున్నారు. అయితే, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అనారోగ్యం దృష్ట్యా కేరళలో చికిత్స పొందుతూ జిల్లా కేంద్రంలో అందుబాటులో లేకపోయినప్పటికీ, ఆయన సోదరుడు..టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్న బాటలో పయనిస్తూ..నిరంతరం రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల పురోగతికి శ్రమిస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ తదితరు



కోటంరెడ్డి సోదరులు (ఫైల్ ఫోటో)

లంతా రూరల్ ప్రగతికి బాసటగా ఉంటూ, కోటంరెడ్డి సోదరుల కృషిని అభినందించారు కూడా. ఈ నేపథ్యంలో కోటంరెడ్డి సోదరుల సేవలు ప్రజల అభిమానానికి పాత్రమవుతున్నాయి.

# నేదురుమల్లి అరెస్ట్-కండలేరు వద్ద ఉద్రిక్తత

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడం మంచిది కాదంటూ ఆదివారం వైఎస్ఆర్సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి కండలేరు జలాశయం సందర్శనకు బయలు దేరగా, వారిని అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులను మోహ రించడంతో కండలేరు వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆ ఉద్యమానికి ప్రజా స్పందన గంట గంటకీ పెరుగుతుండడంతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని, మాజీమంత్రి కాకాణిలను పోలీ సులు అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. అందుకు రామ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలతో హోరెత్తించారు. తమ నాయకుల అరెస్టు అక్రమమని ఆరోపిస్తూ మరోవైపు వైఎస్సార్సీపీ శ్రేణులు నిరసనలకు దిగాయి. అయితే, పరిస్థితి చేయిదాటకుండా పోలీసులు భద్రతను



వైకాపా నేతలతో రాపూరు పోలీస్‌స్టేషన్ వద్ద నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కట్టుదిట్టం చేశారు. రైతాంగం సంక్షేమం కోసం, సాగునీటి సమస్య పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న నేదురుమల్లిని అరెస్టు చేయడం తగదంటూ స్థానిక ప్రజలు, పార్టీల నాయకులు ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

# కాకాణికి..నన్ను తిట్టడమే పని!

## సోమిరెడ్డి ఎద్దేవా



మొగళ్లూరులో సిమెంట్‌రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మాజీమంత్రి కాకాణికి నిద్రలేచింది మొదలు..లేనిపోని విమర్శలు చేస్తూ, నన్ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని, అంతకంటే ఆయనకి వేరే పనేమీ లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇటీవల ఆయన పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు, వాటర్‌ట్యాంక్, గోశాలలను ప్రారం భించి, అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాకాణి తీరును దుయ్యబట్టారు. కాకాణి జీవితంలో చేయని అభివృద్ధి పనులను గెలిచినా, ఓడినా తాను చేశానన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు దేశంలోనే అత్యధిక పెన్షన్‌లు ఇచ్చే రాష్ట్రంగా ఏపీ అందరి ప్రశంసలు అందుకుంటోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్షసాధింపులు తప్ప అభివృద్ధి లేదని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పొదలకూరు మండలంలో 427 పనులు మంజూరై, అందులో 225 పనులు పూర్తయ్యాయని, కాకాణి సొంత మండలమైన పొదలకూరులో ఎన్నడూ చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను తాను చేశానని చెప్పారు. కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్, సోమశిల దక్షిణ కాలువ, మెగా వాటర్‌ప్లాంట్, పలు చెక్‌డ్యామ్‌లు, సీహెచ్‌సీ అప్‌గ్రేడ్, డయాలసిస్ సెంటర్ వంటి అనేక పనులు తమ హయాంలోనే జరిగాయన్నారు. పేదల భూములను ఆక్రమించు కోవడం తప్ప కాకాణి చేసిందేమీ లేదని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు.

# రైతులు.. సాంకేతికతను అందుకోవాలి

## • జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

చాంపియన్ ఫార్మర్స్‌ను ఆదర్శంగా తీసుకొని వ్యవసాయ రంగంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని రైతులు మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రైతులకు సూచించారు. ఇటీవల కోవూరులో చాంపియన్ ఫార్మర్ పునూరు శ్రీనివాసులు సాగుచేస్తున్న వరి పొలాన్ని ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆ రైతు తన పొలంలో వినియోగిస్తున్న సోలార్ లైట్ ట్రాప్స్, ఫెరోమోన్ ట్రాపుల ఉపయోగాల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ ట్రాప్స్‌ను 'ఆత్మ' పథకం ద్వారా వ్యవసాయశాఖ అధికారులు మండలంలో గుర్తించిన 10మంది చాంపి యన్ ఫార్మర్స్‌కు అందజేశారని తెలిపారు. ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామంలోని ప్రతి రైతుకు చేరువ చేసేలా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారు లను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో 'హెల్తియం మెడిటెక్' పరిశ్రమ విస్తరణ



హెల్తియం మెడిటెక్ పరిశ్రమను ప్రారంభిస్తున్న అనీష్ బఫ్నా, శ్రీసిటీ ఎం.డి డా.సన్నారెడ్డి రవీంద్రరెడ్డి

భారతదేశంలోని ప్రముఖ వైద్య పరికరాల తయారీ సంస్థ హెల్తియం మెడిటెక్ శ్రీసిటీలోని తన తయారీ యూనిట్‌ను విస్తరించింది. నూతన విస్తరణ యూనిట్‌ను ఈనెల 9న శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో హెల్తియం సీఈఓ అనీష్ బఫ్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనీష్ బఫ్నా మాట్లాడుతూ, ఈ విస్తరణ భారత్ ఆరోగ్య రంగంలో స్వయం సమృద్ధిని పెంపొందించడంలో తమ నిబద్ధతను చాటుతుందన్నారు. తమ సంస్థలో మహిళలే అధికంగా పని చేస్తున్నారని, ఇది మహిళా సాధికారతకి దోహదం చేస్తుందని అన్నారు. ఈ పరిశ్రమ విస్తరణ పట్ల హర్షం వ్యక్తం చేసిన శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ విస్తరణ శ్రీసిటీలో ఆరోగ్య సంరక్షణ తయారీ రంగంలో పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందన్నారు. కాగా, హెల్తియం మెడిటెక్ సంస్థ 2012లో శ్రీసిటీలో కంపెనీ స్థాపించి స్యూటర్లు, మెష్‌లను తయారు చేస్తోంది. ఈ విస్తరణతో ఉత్పత్తి సామర్థ్యం నెలకు 1.3 లక్షల డజన్ల నుంచి 2.8 లక్షల డజన్లకు పెరగనుంది. గాయాల మాన్పివేత పరికరాలు, శస్త్రచికిత్స స్యూటర్లు, మెష్‌లు తదితర ఆధునిక వైద్య ఉత్పత్తులు ఇక్కడ తయారవుతాయి. ఈ ఉత్పత్తులు భారతదేశంతో పాటు యూరప్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా సహా 90కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ విస్తరణతో ఉద్యోగావకాశాలు రెట్టింపు కానున్నాయని శ్రీసిటీ పారిశ్రామికవర్గాలు భావిస్తున్నాయి.

# నెల్లూరు కబుర్లు

## నిరుపేదలకు.. సిఎంఆర్ఎఫ్ ఓ వరం

**లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి**



నిరుపేదల వైద్య చికిత్సల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉదారంగా సాయం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి జిల్లాలోని ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు సుమారు 6.14 కోట్ల రూపాయల సాయం అందడంతో పేదవర్గాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నెల్లూరు వేదాయపాళెంలోని కార్యాలయంలో మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 61మంది లబ్దిదారులకు 33.53 లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం విశేషం. వైద్యఖర్చులు భరించలేక కష్టాలు పడుతున్న నిరుపేద బాధితులకు సీఎం చేయూత ఒక వరమని ఆయన ఈ సందర్బంగా చెప్పారు.

## రెడ్‌క్రాస్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్లో ఇటీవల ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. రెడ్ క్రాస్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు..స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ పాల్గొని సంక్రాంతి పండుగల విశిష్టతను చిన్నారులకు వివరించారు. తొలుత, భోగిమంటలు వేశారు. భోగిపళ్ళను చిన్నారులపై పోసి, ఆయురారోగ్యాలతో పిల్లలందరూ సంతోషంగా ఉండాలని దీవించారు. బ్లడ్ బ్యాంక్ కోఆర్డినేటర్ బయ్యా ప్రసాద్, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి..లక్ష వితరణ



విరాళం చెక్కును అందజేస్తున్న పురిణి శ్రీనివాసులు, వసంత

నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు పురిణి శ్రీనివాసులు, పురిణి వసంత ఇటీవల లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మికి ఆ విరాళం చెక్కును అందజేశారు. ఆసుపత్రి జనరల్ మేనేజరు ఇస్కా భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల పనితీరు భేష్!

**• మెచ్చుకున్న హోంమంత్రి అనిత**



జిల్లా ఎస్పీ అజిత వేజండ్లను అభినందిస్తున్న హోంమంత్రి అనిత

నేరం చేసిన వారి పట్ల నెల్లూరు పోలీసులు అనుసరిస్తున్న తీరు బాగుందని, నేరస్తులను రోడ్లపై నడిపించుకుంటూ వెళ్ళి ఇక్కడి పోలీసులు రాష్ట్రంలోనే కొత్త సంస్కృతిని ప్రవేశపెట్టారంటూ రాష్ట్ర హోంమంత్రి అనిత అభినందించారు. ఈనెల 9న ఆమె నెల్లూరు సెంట్రల్ జైలుని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీసులు ఇదే విధానాన్ని కొనసాగించడం వల్ల, రౌడీలు నేరాలు చేయాలంటే భయపడే పరిస్థితి వస్తుందన్నారు. రౌడీయిజాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రౌడీయిజాన్ని రూపుమాపేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రప్పా రప్పా అంటూ కత్తులు పట్టుకుని తిరుగుతుంటే చూస్తూ ఊరుకునేది ఉండదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. తొలుత ఆమె, జైలులో ఖైదీల వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జైలు అధికారుల పనితీరు బాగుందని ఆమె కితాబిచ్చారు. జైలులో ఉన్న ఖైదీలు పలు రకాల ఉత్పత్తులు తయారు చేస్తుండడం మంచి పరిణామమన్నారు. హోంమంత్రి వెంట జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డె ఓబన్న జీవితం.. స్ఫూర్తిదాయకం

**జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు**



ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, దేశభక్తుడు వడ్డె ఓబన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 11న ఆయన నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓబన్న జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల్లో వడ్డె ఓబన్న ఒకరన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 11న వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ద్వారా వారి సేవలకు మరింత గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. తొలుత ఆయన వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు వల్లెపు మునిస్వామి, బత్తల క్రిష్ణయ్య, జిల్లా వడ్డెర నాయకులు గుంజి సుధాకర్, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు ఉప్పు భాస్కర్, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

## 20న.. జడ్పీ స్థాయీసంఘాల సమావేశం

జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 20న జరుగనున్నాయి. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఆరోజు ఉదయం 10.30 నుంచి ఈ సమావేశాలు ప్రారంభమవుతాయని, సంబంధిత శాఖల అధికారులు, జడ్పీ సభ్యులు హాజరు కావాలని జడ్పీ సీఇఓ శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.






## షాదీమంజిల్ అభివృద్ధికి కమిటీ

**• మంత్రి నారాయణ సమక్షంలో ప్రమాణస్వీకారం**



నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు కోటమిట్టలోని షాదీ మంజిల్ అభివృద్ధికి నియమించిన కమిటీ ఇటీవల మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, గతంలో అబ్దుల్ అజీజ్ మేయర్‌గా ఉన్నప్పుడు ఆయన అభ్యర్ధనల మేరకు షాదీమంజిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కమిటీలో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని, నగరపాలక సంస్థ కమిషనర్ వైస్‌చైర్మన్‌గా, మైనారిటీస్ వెల్ఫేర్ అధికారి, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మెం బర్లుగా ఉంటారని ఆయన అన్నారు. పేద విద్యార్థులకు వక్ఫ్‌బోర్డ్ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూలు ఏర్పాటు చేసేందుకు భూమి పూజ కూడా చేశామని, త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో షాదీమంజిల్ అభివృద్ధికి కృషి జరుగుతుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జమనుల్లా బాషా, ఇమాముద్దీన్, మహబూబ్ బాషా, హఫీజ్, రియాజ్ అహ్మద్, సయ్యద్ తహసీన, జాఫర్ షరీఫ్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్ పాల్గొన్నారు

## రత్నం లోగిలిలో సంక్రాంతి సంబరాలు



అందంగా రంగవల్లులకు రంగులు అద్దుతున్న డా. కిషోర్స్ రత్నం విద్యార్థులు

నెల్లూరు సరస్వతినగర్‌లోని డా. కిషోర్స్ రత్నం స్కూల్‌లో ఇటీవల ఆనందోత్సాహాలతో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ పాఠశాలకు వచ్చారు. సంక్రాంతి పండుగ వాతావరణంతో పాఠశాలను తీర్చిదిద్దారు. ఆటపాటలతో అందరినీ అలరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. గాలిపటాలు ఎగరేసి ఆనందించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు ఈ సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ తుహీనా, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర పాల్గొన్నారు.

## వైసీపీ నేతలను అడ్డుకోవడం అక్రమం

**• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి**



సోమశిల ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్ళే వైసిపి నేతలను అడ్డుకొని హౌస్ అరెస్ట్‌లు చేయడం దుర్మార్గమని ఎమ్మెల్సీ.. వైఎస్సార్సీపీ నాయకుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నుంచి సోమశిల ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరిన.. వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను, తనను పోలీసులు అడ్డుకున్నారని, దీంతో తాము రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపామని చెప్పారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన రాజకీయ స్వలాభం కోసం వాడుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు.

# నెల్లూరును.. సుందరంగా తీర్చిదిద్దుతా!

## • మంత్రి నారాయణ


ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆధునీకరించిన ఫ్లైఓవర్ మీద బైక్‌పై దూసుకెళ్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది, స్మార్ట్ సిటీగా రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 11న ఆయన నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆధునీకరించిన ఫ్లై ఓవర్ (బ్రిడ్జి)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1996వ సంవత్సరంలో దీని నిర్మాణం మొదలుపెట్టి 1999లో ప్రారంభించడం జరిగిందని, అప్పటినుంచి ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదన్నారు. నేడు కేవలం 45రోజుల్లోనే తాము అన్ని మరమ్మత్తులు పూర్తి చేయించి ప్రజలకి అందుబాటులోకి తెచ్చామన్నారు. నగరంలో దెబ్బతిన్న 13 డ్రెయిన్లకు వెంటనే మరమ్మత్తుల కోసం రూ.50 కోట్ల నిధిని మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆయన ఫ్లైవర్‌పై బైక్ నడపడం అందరినీ ఆకట్టుకుంది.

### 50వేల మొక్కలు నాటేవిధంగా చర్యలు :

నెల్లూరు నగరంలో పచ్చదనం కోసం సుమారు 50వేల మొక్కలను నాటే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి నారాయణ తెలిపారు. ఈనెల 11న ఆయన నగరంలోని 14వ డివిజన్ సాయిబాబా గుడి వద్ద ద్వారకామాయి నగర్‌లో చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో 2000 మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క వీధిలో ఒక్కో రకం పూలు పూసే విధంగా చెట్లు నాటడం జరుగుతుందన్నారు.

### ఉత్సాహంగా 'హ్యాపీ సండే'

నిరంతరం పని వత్తిడితో ఉన్నప్పటికీ, వారానికోసారి ఆట విడుపు కోసం 'హ్యాపీ సండే' కార్యక్రమం ద్వారా అందరూ సంతోషంగా ఉండాలంటూ ఆ కార్యక్రమానికి మంత్రి పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టారు. నెల్లూరులోని 48వ డివిజన్లో ఆయన 'హ్యాపీ సండే' కార్యక్రమం నిర్వహించి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా చిన్నారులు, కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, మ్యాజిక్ షో వగైరాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

### పేదలకు 'సంక్రాంతి కానుకలు'

పేద ప్రజలకు సంక్రాంతి కానుకగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలను మంత్రి నారాయణ అభినందించారు. నెల్లూరు నగరంలోని 6వ డివిజన్ పప్పులవీధిలో కొండా ప్రవీణ్ శంకర్ మిత్రమండలి, ముక్కాల ద్వారకానాద్ మిత్రమండలి ఆధ్వర్యంలో 'పేదలకు సంక్రాంతి కానుకలు' పేరుతో సేవా కార్యక్రమం జరిగింది. మంత్రి నారాయణ పాల్గొని 1020 మంది పేదలకు పలసరుకులను పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు మంత్రి గాలిపటాలు అందజేసి ఆ చిన్నారుల్లో ఆనందం నింపారు.

### కోటమిట్టలో పార్కుకు ప్రారంభోత్సవం

ఇటీవల మంత్రి నారాయణ నెల్లూరు, కోటమిట్టలో రూ.15 లక్షలతో ఆధునీకరించిన అమీన్‌నగర్ పార్క్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా, పార్క్‌కు వచ్చిన చిన్నారులతో కలిసి ఆయన కొంతసేపు ఆహ్లాదంగా గడిపారు.

### క్రికెట్ పోటీలను ప్రారంభించిన మంత్రి

సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు, 54వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని ఈద్గా మైదానంలో నారాయణ ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఇటీవల మంత్రి నారాయణ ప్రారంభించారు. తొలుత, మంత్రి క్రికెట్ బ్యాట్ చేతబట్టి మ్యాచ్ ప్రారంభించారు. ఈ ప్రాంతంలో అత్యాధునిక హంగులతో వాలీబాల్, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయిస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.


క్రికెట్ ఆడుతున్న నారాయణ

# టాటా పవర్ ప్లాంట్.. హర్షదాయకం


ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు జిల్లాలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో టాటా సంస్థ రూ. 6675 కోట్లతో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనుండటం పట్ల నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఏళ్ళతరబడిగా ఎలాంటి పురోగతిలేని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని, ఈ ప్లాంట్ ద్వారా దాదాపు 1000 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయని, ఇది ముఖ్యమంత్రి పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. దేశీయ సౌర పరికరాల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు.. చైనా నుంచి దిగుమతి తగ్గించుకోవడానికి భారీ ప్రాజెక్టును ఏపీలో నెలకొల్పేందుకు టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్(టీపీఆర్ఇఎల్) నిర్ణయం తీసుకోగా, దేశంలోనే అతిపెద్దదైన 10గిగావాట్ల సామర్థ్యం గల ఇంగాట్, వేఫర్ తయారీ ప్లాంట్‌గా ఇది నిలవనుందన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. ఇక్కడ పరిశ్రమను కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీసిటీలో.. జీఎస్టీ అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్, డా. రవీంద్ర సన్నారెడ్డి

"జీఎస్‌టీ 2.0 భారతదేశ పరోక్ష పన్నుల వ్యవస్థకు రీసెట్ లాంటిదని, ఇది పన్ను రేట్ల సరళీకరణ, కఠినమైన నిబంధనలతో పాటు వివాదాలను వేగంగా పరిష్కరిస్తుందని గుంటూరు ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పీ.ఆనంద్‌కుమార్ చెప్పారు. ఈనెల 9న శ్రీసిటీలో జీఎస్‌టీ సంస్కరణలు, ఆడిటర్ల పాత్రపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్‌టీ సవరణలు, ఆడిటర్ల పాత్రపై అందరికీ తగు అవగాహన ఉండాలన్నారు. ప్రత్యేకించి ఆడిటర్లకు ఇది కేవలం తనిఖీలకే కాకుండా సలహాదారుగా, రిస్క్ మేనేజ్‌మెంట్, డిజిటల్ అనుసరణలో కొత్త బాధ్యతలను కల్పిస్తుందన్నారు. కేంద్ర పరోక్ష పన్నులు మరియు కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ), శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు జరిగింది.

# శ్రీసిటీలో యూపీ అధికారుల బృందం



ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి (యుపిఎస్ఐడిఏ)కి చెందిన తొమ్మిది మంది అధికారుల బృందం, లలిత్‌పూర్‌లో బల్క్ డ్రగ్ ఫార్మా పార్క్ అభివృద్ధికై శ్రీసిటీ నమూనా అధ్యయనం కోసం ఈ నెల 10న శ్రీసిటీకి వచ్చింది. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ రాజీవ్ త్యాగి నేతృత్వంలో వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి స్వాగతం పలికారు. దేశంలోని వివిధ రాష్ట్రాల పారిశ్రామిక సంస్థలు శ్రీసిటీ మోడల్‌ను అధ్యయనం చేయడం పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

# పాసుపుస్తకాలపై రైతులకు అవగాహన కలిగించండి

## • తహశీల్దార్లతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి


తహశీల్దార్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన పట్టాదారు పాసుపుస్తకాలపై రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కలిగించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. ఇటీవల నెల్లూరు మాగుంట లేఔట్‌లోని తమ నివాసంలో ఆమె కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, కోవూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల తహశీల్దారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గమంతటా రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి కావడం సంతోషకరమన్నారు. ఆ పుస్తకాలపై ముద్రించి వున్న క్యూఆర్ కోడ్ గురించి రైతులకు అర్థమయ్యేలా వివరించాలని ఆమె తహశీల్దార్లను ఆదేశించారు. పాస్ పుస్తకాలలో రైతుల పేర్లు, భూమి విస్తీర్ణం.. ఇతరత్రా ఏదైనా ముద్రణా లోపాలుంటే క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకొని, ఆ పొరపాట్లు సవరించుకోవచ్చన్న విషయాన్ని రైతులకు తెలపాలని ఆమె వారికి సూచించారు.

రైతులకు ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు అవసరమని, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల వారీగా వాటి ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని ఆమె అధికారులకు చెప్పారు. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు నెలకొల్పి చిన్న మధ్య మరియు సూక్ష్మ తరహా పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమగ్ర ప్రణాళిక రూపొందించారని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. ఆమేరకు కోవూరు నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, అందుకు సంబంధించి స్థల సేకరణతో పాటు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు అందరూ సహకరించాలని ఆమె తహశీల్దార్లను కోరారు.

ఈ సమావేశంలో ఇందుకూరుపేట, కోవూరు, విడవలూరు కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం తహశీల్దార్లు మురళి, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, స్ఫూర్తిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# విద్యార్థులకు 'విజయదీపిక'లు



విద్యార్థులకు 'విజయదీపిక' స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్, కమిషనర్ నందన్

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమంగా రాణించేందుకు రూపొందించిన 'విజయదీపిక' పుస్తకాలు..స్టడీ మెటీరియల్‌ను ఇటీవల నెల్లూరు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 16 మునిసిపల్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ వై.నందన్‌లు 'విజయదీపిక'లను అందజేశారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వారు సూచించారు.

# స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాసులు

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ అంశాల్లో యువతకు పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. విఎస్‌యు వైస్ చాన్స్‌లర్ అల్లం శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూలస్తంభలాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి స్వామి వివేకానంద అనేక ఉత్తేజకర ప్రసంగాలు చేశారన్నారు. సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏ.నాగేశ్వరరావు, స్వామి హృదయానంద(రామకృష్ణ మిషన్), వైస్‌ప్రిన్సిపాల్ డా. ఎ.హజరత్ బాబు, యూత్ అధికారి డా. ఎ.మహిధర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖాధికారి బి.గురప్ప తదితరులు పాల్గొన్నారు.

## 'అంతరంగ దీపం'

# కవితాసంపుటి విష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరించిన జల్లి విద్యాధర్ తదితరులు

ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యాయురాలు పార్లపల్లి నాగేశ్వరి రచించిన 'అంతరంగ దీపం' కవితా సంపుటిని ఈనెల 11న నెల్లూరులో ఆవిష్కరించారు. పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విమల సాహితీసమితి వ్యవస్థాపక అధ్యక్షులు జల్లి విద్యాధర్ పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ప్రముఖ కవి అవ్వారు శ్రీధర్‌బాబు పుస్తకాన్ని సమీక్షించారు. పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య అవార్డు గ్రహీత డా. గంగిశెట్టి శివకుమార్, విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు, ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద, పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచలనరసింహం, ప్రముఖ కవులు చిన్ని నారాయణ రావు, ఈతకోట సుబ్బారావు, అన్నం శివకృష్ణ, బొగ్గరపు రాధాకృష్ణ, ఇంద్రగంటి మధుసూదనరావులతో పాటు పలు సాహితీ సంఘాల ప్రతినిధులు పాల్గొని కవయిత్రి నాగేశ్వరిని అభినందించి, సన్మానించారు.

# అగ్నిగుండంలా ఇరాన్

మనసులో మాట 80

పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర అలజడి చెలరేగింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరిగిన తీవ్ర యుద్ధం ముగిసిందని ప్రపంచం ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఆ ప్రాంతంలో మరో ముఖ్యమైన దేశం ఇరాన్‌లో ప్రజాగ్రహం మిన్నంటుతోంది. ఇటీవలి కాలంలో ఇతర దేశాల అంతర్గత విషయాల్లో నేరుగా జోక్యం చేసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్... ఇరాన్ విషయంలోనూ వేలు పెట్టడానికి సిద్ధమవుతున్నట్లు సంకేతాలివ్వడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

టెహ్రాన్ బజార్లలో మొదలైన ప్రజల నిరసనలు, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 170కి పైగా నగరాలకు వ్యాపించాయి. గత రెండు వారాలుగా ఉద్యమం తీవ్రమైంది, ప్రభుత్వ ప్రతిచర్యలతో మృతుల సంఖ్య 500 దాటింది. ప్రభుత్వం ఇంటర్నెట్‌ను నిలిపివేసి, నిరసనకారులపై నేరుగా కాల్పులు జరుపుతున్నా, ప్రజలు భయాన్ని విడిచిపెట్టారు. ఇరాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభమే తాజాగా నిరసనలకు ప్రధాన కారణమయినప్పటికీ కొన్ని దశాబ్దాలుగా గూడుకట్టుకుని ఉన్న ఆగ్రహం ఆర్థిక సంక్షోభానికి తోడయింది. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ప్రజల నిక్షిప్తమైన ఆగ్రహం ఇప్పుడు బయటపడుతోందని చెప్పవచ్చు.

ప్రస్తుత పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. జనవరి 2026 నాటికి, ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. రియాల్ విలువ రికార్డు స్థాయికి పడిపోగా, ద్రవ్యోల్బణం ఏకంగా 70 శాతానికి చేరుకుంది. నిరసనకారులు రహదారులను దిగ్బంధిస్తున్నారు, పాలకవర్గానికి చెందిన బసీజ్ దళాల వాహనాలకు నిప్పుపెడుతున్నారు. సుప్రీమ్ లీడర్ అలీ ఖమేనీ నివాసం గేట్లను సైతం దాటి నిరసనకారులు ముందుకు వెళ్తున్నారంటే ప్రజాగ్రహం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. భద్రతా బలగాలు గ్రెనేడ్లు, తుపాకులతో దాడులు చేస్తున్నాయి. మానవహక్కుల గ్రూపుల లెక్కల ప్రకారం, 538 మందికి పైగా మరణించారు, 10,600 మందికి పైగా అరెస్టు అయ్యారు.

ఇది కేవలం ఆర్థిక ఆందోళనగా మొదలైనా, ఇప్పుడు 'పాలన మార్పు' డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఆందోళనలు డిసెంబర్ 2025 చివర్లో మొదలయ్యాయి. ప్రభుత్వం వ్యాపారులకు ఇచ్చే రాయితీతోకూడిన డాలర్లను హఠాత్తుగా నిలిపివేయడంతో టెహ్రాన్ బజార్ వ్యాపారులు సమ్మెకు దిగారు. ఇది దేశవ్యాప్త ఉద్యమంగా మారింది. దశాబ్దాలుగా ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి కారణంగా దీర్ఘకాలిక ఆర్థిక నిర్వహణ వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. ఇరాన్ అణు కార్యక్రమాలపై అమెరికా విధించిన కఠిన ఆంక్షలతో ఆర్థిక పరిస్థితి మరింత దుర్భరంగా తయారయింది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, దిగుమతులకు రాయితీలు లేకపోవడంతో ప్రజల జీవనం దుర్భరంగా తయారయింది.

2022లో మహ్సా అమినీ మరణం తర్వాత జరిగిన మహిళా-కేంద్రిత నిరసనలకు ప్రస్తుత నిరసనలు కొనసాగింపుగా చెప్పవచ్చు కానీ, ఈసారి పూర్తిగా ఆర్థిక వ్యవస్థ కేంద్రంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. నిజానికి, ఈ ఆగ్రహం 1979 ఇస్లామిక్ విప్లవం నుంచే గూడుకట్టుకుని ఉంది. అప్పటినుంచి ప్రజలు ఎదుర్కొంటున్న అణచివేత, ఆర్థిక అసమానతలు, మానవ హక్కుల ఉల్లంఘనలే ఇప్పుడు నిప్పురవ్వలా ఎగిసిపడుతున్నాయి. గతంలో ప్రభుత్వాన్ని అంటిపెట్టుకుని ఉన్న సంప్రదాయ వ్యాపార వర్గం సైతం ఇప్పుడు వీధుల్లోకి వచ్చి నిరసనల్లో పాల్గొంటున్నారు.

ప్రస్తుత నిరసనల్లో అమెరికాలో ప్రవాసంలో ఉంటున్న రెజా పహ్లవి కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయన చివరి షా మహమ్మద్ రెజా పహ్లవి కుమారుడు. 1979 విప్లవం తర్వాత అమెరికాకు వచ్చిన పహ్లవి, ఇప్పుడు ఇరాన్ ప్రతిపక్ష నేతగా ఎదిగారు. నిరసనకారులకు మార్గదర్శకాలను అందిస్తూ, ఉద్యమాన్ని నడిపిస్తున్నారు.

చాలా మంది నిరసనకారులు "డెత్ టు ఖమేనీ", "లాంగ్ లైవ్ ది షా" అంటూ నినాదాలు ఇస్తున్నారు. పహ్లవి 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇరాన్' వంటి గ్రూపులను స్థాపించి, స్వేచ్ఛాయుత ఎన్నికలు, ఉదార ప్రజాస్వామ్యాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఇరాన్‌లోని ప్రజాగ్రహం అంతర్గత వ్యవహారాలకే పరిమితమవుతుందా, యుద్ధం లాంటి పరిస్థితులు ఎదురవుతాయా అన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరసనకారులకు బహిరంగ మద్దతు ప్రకటించడమే ఇందుకు కారణం. "ఇరాన్.. అక్కడి ప్రజలను చంపితే, అమెరికా వారిని రక్షించడానికి వచ్చేస్తుంది. మేము లాక్డ్ అండ్ లోడెడ్‌గా సిద్ధంగా ఉన్నాం(మా ఆయుధాలు సిద్ధంగా ఉన్నాయి) " అంటూ ట్రూత్ సోషల్‌లో హెచ్చరించారు. తనతో చర్చలు జరపాలని ఇరాన్ నేతలు కోరుకుంటున్నారని, అయితే అంతకంటే ముందే దాడులు జరగవచ్చని ట్రంప్ ప్రకటించడంతో యుద్ధ భయాలు అలముకున్నాయి.

హమాస్‌కు మద్దతుగా నిలిచే ఇరాన్‌ను ఇజ్రాయెల్ శత్రుదేశంగానే భావిస్తోంది. అమెరికా స్పందనను బట్టి ఇజ్రాయెల్ కూడా రంగంలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నట్లు కనబడుతోంది. తాజా నిరసనల వెనక అమెరికా, ఇజ్రాయెల్ ఉన్నాయని ఇరాన్ సుప్రీమ్ లీడర్ అలీ ఖమేనీ, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆరోపించారు. అమెరికా జోక్యం చేసుకుంటే, ఆ దేశ సైనిక స్థావరాలు, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ నాయకులు హెచ్చరించారు.

రష్యా, చైనాలు ఇరాన్ ప్రస్తుత పాలకవర్గానికి నైతికంగా మద్దతు ఇస్తున్నాయి. విదేశీ శక్తులు జోక్యం చేసుకోరాదని అంటున్నాయి. అయితే, బహిరంగంగా సైనిక సాయాన్ని ప్రకటించడం లేదు. ప్రస్తుతానికి, అమెరికా నేరుగా సైనిక జోక్యం చేసుకుంటుందా అనేది అతిపెద్ద ప్రశ్న. అమెరికా జోక్యాన్ని బట్టి పశ్చిమాసియా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ కోసం పోరాడుతున్నారు. అయితే ప్రజాగ్రహం ఆవిరైపోతుందా, లేదా అది ఒక విప్లవంగా రూపాంతరం చెందుతుందా? ప్రపంచం వారికి అండగా నిలబడాలా లేదా చూసి ఊరుకోవాలా? ఈ సంక్లిష్ట ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో తెలతాయి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్





## ఉపాధి పథకం పేరుమార్పుపై..

## నెల్లూరులో కాంగ్రెస్ అధ్యక్షుని దీక్ష!

ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలంటూ జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు ప్రారంభమయ్యాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా నియమితులైన నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు-నాయకులతో కలిసి ఈనెల 11న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద నిరాహారదీక్ష చేశారు. అఖిలభారత కాంగ్రెస్‌పార్టీ పిలుపు మేరకు దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం గత రెండు దశాబ్దాలుగా పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందని, ప్రధాని నరేంద్రమోదీ ఆ పథకంలోని మహాత్మాగాంధీ పేరును తీసివేసి విబీ జీ రాంజీ పేరుగా మార్చడం సమంజసం కాదన్నారు. ఎంతోకాలంగా విజయవంతంగా కొనసాగుతున్న ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం భావిస్తూ, ఆ పథకంలోని మహాత్మాగాంధీ పేరును తొలగించడం దారుణమన్నారు. అంతేకాక, ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం వ్యయాన్ని భరించాలని ఆ పథకంలో మార్పులు చేయడం వల్ల రాష్ట్రాలు అంతటి ఆర్థికభారాన్ని మోయలేవన్నారు. ఈ దీక్ష సందర్భంగా జిల్లాలోని మనుబోలు మండలం అక్కంపేట గ్రామ సర్పంచ్ జాంబవతి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఇర్ఫాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర, నాయకులు సుధీర్, మల్లికార్జునరెడ్డి, రాజా పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధానికి..

## ప్రజానాట్యమండలి ఆందోళన

మాదకద్రవ్యాలను నిరోధించాలని, ముఖ్యంగా గంజాయి, మత్తుపదార్థాలను తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బుచ్చిరెడ్డిపాళెంలో ప్రజానాట్యమండలి, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర ప్రజాసంఘాల వారు ఆందోళన చేపట్టారు. ఆమేరకు ప్రతిజ్ఞ చేయిస్తూ ఈనెల 11న ప్రజల నుంచి సంతకాల సేకరణ గావించారు. స్థానిక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు చలంచర్ల వెంకటరత్నయ్య మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో గంజాయి మత్తుకు యువత, విద్యార్థులు బానిసలవుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మత్తువల్ల వారు ఏంచేస్తున్నారో కూడా తెలియని స్థితిలో నేరాలకు ఘోరాలకు పాల్పడుతున్నారని, కొందరు సంఘవిద్రోహశక్తులు వారిని అసాంఘిక కార్యకలాపాలకు ప్రేరేపిస్తున్నారని అన్నారు. ప్రజానాట్యమండలి నాయకులు మల్లికార్జునరావు, మల్లికార్జున, కృష్ణప్రసాద్, సురేష్, నారాయణ, జానీబాషా, యువజన సంఘం మండల కార్యదర్శి సతీష్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై

## దాడులపట్ల నిరసనలు

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అమానుష దాడుల పట్ల నెల్లూరులో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 11న బీజేపీ సీనియర్ నాయకులు మిడతల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక అరవిందనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దారుణమన్నారు. ఆ ఘటనలను దేశంలోని హిందువులంతా ఖండించాలని కోరారు. గత 20 రోజుల్లోనే ఆరుగురు హిందువులు హత్యకు గురయ్యారని, మరెందరో స్త్రీలు అత్యాచారాలకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హిందువుల ఆలయాలు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, పరిస్థితి ఇంత విషమంగా ఉన్నా మన దేశంలో ఒక్క బీజేపీ మినహా, ఇతర వామపక్షపార్టీలు నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ఈ ఆందోళనలో బీజేపీ నాయకులు సిహెచ్ సుబ్రహ్మణ్యం, శ్రీధర్, కృష్ణారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరిలో..దత్తేశ్వరానంద పూజలు



దత్తేశ్వరానంద స్వామికి స్వాగతం పలుకుతున్న వేదగిరి ఆలయ అధికారులు

కుర్తాళం పీఠ ఉత్తరాధికారులు.. పరమహంస పరివ్రాజకాచార్య.. జగద్గురు శ్రీ దత్తేశ్వరానంద భారతీ మహాస్వామి ఈనెల 10న నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండపై ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనర సింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామీజీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ శ్రీ నరసింహస్వామికి–శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ పాలక మండలి ఛైర్మెన్ అచ్యుత శంకరరెడ్డి, కార్యనిర్వహణాధికారి గోపి, అర్చకులు పాల్గొన్నారు.

## నెల్లూరులో...

శ్రీ దత్తేశ్వరానంద భారతిస్వామి వారు తన ఆలయ సందర్శనల్లో భాగంగా ఈనెల 10న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీకి ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అదేవిధంగా, నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువుగట్టుపై వెలసివున్న శ్రీ ఇరుకళల అమ్మవారి ఆలయాన్ని స్వామీజీ దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ గిరికృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి పథకం పేరుమార్పు సరికాదు



## కాంగ్రెస్ నాయకుడు బాలసుధాకర్

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సరికాదని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు బాలసుధాకర్ అన్నారు. ఈ నెల 11న ఆయన కోట మండలంలోని విద్యానగర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదల పట్ల చిన్నచూపు చూస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు ఉంటే, కేంద్రం దానిని తొలగించడం సముచితం కాదన్నారు. కూలీల ఉపాధికి భరోసా కల్పించే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేవిధంగా ప్రయత్నించడం మంచిది కాదని ఆయన అన్నారు.

## రామచంద్రారెడ్డి ఆసుపత్రికి..

# లక్ష విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న ఆంజనేయప్రభు

నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలకి స్థానిక ఏసీనగర్‌కి చెందిన పంచాగ్నుల ఆంజనేయప్రభు ఈ నెల 10న లక్ష రూపాయల విరాళం అందించారు. పేదప్రజల ఆరోగ్యానికి ఈ విరాళాన్ని వినియోగించాలంటూ ఆయన ఆ చెక్కును ఆసుపత్రి సూపరిటెండెంట్ రాజేశ్వర రావుకు అందజేశారు.

## విద్యార్థులకు..

# వేమన పద్యాల పోటీలు

ప్రజాకవి వేమన రచించిన పద్యాలపై నెల్లూరులోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక వారు ఈనెల 10న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. నెల్లూరు నగరంతో పాటు, ముత్తుకూరులోని పలు పాఠశాలల్లోనూ ఈ పోటీలు జరిగాయి. విజేతలకు ఈనెల 19న.. వేమన జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వేదిక నాయకులు రత్నం, నర్మద, పద్మజ, లక్ష్మయ్య తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు.

## మంత్రి నారాయణ సతీమణి ఆధ్వర్యంలో..

# సంక్రాంతి సంబరాలు

### భోగిమంటలు, రంగవల్లులు, పిండివంటలతో కళకళ



నారాయణ మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న రమాదేవి

భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులు, పిండివంటల ఘుమ ఘుమలతో నెల్లూరులో సంక్రాంతి పండుగ శోభాయమానమైంది. మంత్రి డా. పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఆధ్వర్యంలో స్థానిక నారాయణ మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఈనెల 10న ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటేలా సాగాయి. వెయ్యిమందికి పైగా మహిళలు ఈ సంబరాల్లో పాల్గొని ఆటపాటలతో అలరించారు. ముందుగా భోగిపండగ కార్యక్రమ విశిష్టత తెలుపుతూ భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా నారాయణ సతీమణి రమాదేవి చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం, సంక్రాంతి విశిష్టతను చాటేలా రంగవల్లులు అలంకరించారు. స్వయంగా ఆమె కట్టెల పొయ్యిపై పొంగలి వండి అందరికీ పంచారు. మహిళలకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్ రేస్, షాట్ పుట్, త్రోబాల్, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ వేడుకల్లో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగవల్లుల పోటీలు..సృజనాత్మకతకు వేదికలు..

మహిళల్లో సృజనాత్మకతకు మంచి వేదికలు రంగవల్లుల పోటీలని మంత్రి నారాయణ సతీమణి రమాదేవి చెప్పారు. ఇటీవల సంతపేట 49వ డివిజన్ యనమలవారి వీధిలో రంగవల్లుల పోటీలను ఆమె తిలకించారు. నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మహిళలకు ఆమె బహుమతులను ప్రదానం చేశారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

## జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల హెచ్చరించారు. గూడూరు ఒకటవ, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ తనిఖీల్లో గూడూరు డీఎస్పీ గీతాకుమారి, సి.ఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, ఎస్.ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## • జడ్పీ డిప్యూటీ సి.ఈ.వో మోహన్

గూడూరుని నెల్లూరు జిల్లాలో కలపడంతో పలు శాఖల అధికారులతో జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ఇటీవల గూడూరులో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించామని, ప్రధానంగా గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరిత గతిన ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా నేమ్ బోర్డులు మార్చాలని ఆదేశించామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతినందజేస్తున్న డా. సి.రోహిణి

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 10న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. డాక్టర్ సి.రోహిణి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి జి.శివరంజని, ద్వితీయ బహుమతి ఎస్. ప్రసూన, తృతీయ బహుమతి ఎ.రమ గెలుపొందగా, పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులందజేశారు. సంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి ఉద్య లలిత తదితరులు పాల్గొన్నారు.

## సిరామిక్ యూత్ ఆధ్వర్యంలో...



విజేతలకు బహుమతినందజేస్తున్న డా. సి.జనార్ధన్‌రెడ్డి - డా. సి.రోహిణి

గూడూరులోని శ్రీ ఆంజనేయస్వామి గుడి వద్ద ఐటిఐ ప్రాంగణంలో ఈ నెల 11వ తేదీ సిరామిక్ యూత్, గూడూరు ప్రజాసమితి కన్వీనర్ కోడూరు మీరారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, పోటీలో గెలుపొందిన మహిళలకే కాకుండా, ముగ్గులు వేసిన ప్రతి మహిళకు ప్రముఖ వైద్యులు సి.జనార్ధన్‌రెడ్డి – సి.రోహిణి, ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావులు మెమెంటోలు అందజేశారు. గురుగుహ తదితరులు పాల్గొన్నారు.



వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులో జరిగిన నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలో ద్వితీయ బహుమతి సాధించిన గూడూరులోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తున్న రాష్ట్ర పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ.

# పేదలకు 'రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్' వస్త్రాలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న రాజనేని శ్రీనివాసులునాయుడు

చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలోని శ్రీ భవానీ సమేత నాగలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఈ నెల 11వ తేదీ రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులునాయుడు దాతృత్వంతో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మూడు గ్రామాల్లోని పేద ప్రజలకు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద ప్రజలందరూ సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో పది సంవత్సరాలుగా రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందజేయడం జరుగుతుందని, మత్తు పదార్థాలకు, జూదాలకు దూరంగా ఉండి తమ కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలియజేశారు. ట్రస్ట్ కోఫౌండర్ రాజనేని శిరీషమ్మ, అధ్యక్షులు పిచ్చయ్యనాయుడు, కార్యదర్శి రామయ్యనాయుడు, ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్, ఆవుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మనసు ఫౌండేషన్' వారి
# అక్షర యజ్ఞం.. అద్వితీయం!

**• '3 కోట్ల తెలుగు పేజీల డిజిటలైజేషన్ సభ'లో మండలి బుద్ధప్రసాద్**



సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ తదితరులు

'మనసు ఫౌండేషన్' అక్షరయజ్ఞం అద్వితీయమని, తెలుగు భాషకు 'మనసు రాయుడు' కృషి మరువలేమని మాజీమంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం కనియంపాడులో మనసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న జరిగిన 'మూడుకోట్ల తెలుగు పేజీల డిజిటలైజేషన్ సభ'కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం, యూనివర్సిటీలు చేయలేని పనిని 'మనసు రాయుడు' చేయడం గొప్ప విషయమన్నారు. పరిశోధకులకు మనసు ఫౌండేషన్ డిజిటలైజేషన్ కార్యక్రమం కల్పతరువని, ఇది తెలుగు జాతికి గొప్ప సంపద అని అభివర్ణించారు. మనసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటలైజేషన్ సమాచారాన్ని త్వరలో వెబ్‌సైట్ ద్వారా అందరికీ అందుబాటులోకి తెస్తామని ఈ సభలో మనసు ఫౌండేషన్ అధినేత మన్నం రాయుడు వెల్లడించారు. మనసు ఫౌండేషన్ ద్వారా 2008లో డిజిటలైజేషన్ కార్యక్రమం ప్రారంభమైందని, 2022 నాటికి..కోటి పేజీలను డిజిటలైజేషన్ చేయటం జరిగిందని, 2022 నుండి ఇప్పటికి ఆ సంఖ్య మూడుకోట్ల పేజీలకు చేరిందని ఆయన వివరించారు. ఈ కృషి ఇక ముందుకూడా కొనసాగుతుందన్నారు. సిపిఎం నేత బివి రాఘవులు మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ ప్రక్రియ చిన్న విషయం కాదని, మనసు ఫౌండేషన్ రాయుడు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేస్తున్నారని అభినందించారు. తెలుగు జాతి ఉన్నంతకాలం మనసు ఫౌండేషన్ రాయుడుని అందరూ గుర్తుంచుకుంటారని ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మనసు ఫౌండేషన్‌ను బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు. మనసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడుకోట్ల పేజీల సాహిత్యం డిజిటలైజేషన్ కార్యక్రమం జరగడం అభినందనీయమని, గతంలో బ్రౌన్‌లాగా, ఇప్పుడు మన రాయుడు తెలుగు అక్షరాల్ని భద్రం చేస్తున్నారని, భవిష్యత్ తరాలకు ఇది అక్షర సంపద అవుతుందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం సంతోషం వ్యక్తం చేశారు. ప్రముఖ కవయిత్రి చంద్రలత, సాహిత్య విమర్శకులు ఎ.రజాహుస్సేన్, ముత్తేవి రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడుతూ మనసు ఫౌండేషన్ తెలుగు భాషకు చేస్తున్న కృషి అద్వితీయమన్నారు. మాజీ ఎంపిపి సుంకర వెంకటాద్రి, పెద్ది సాంబశివరావు, డాక్టర్ జివి పూర్ణచందు, పారా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మదన్ ఆధ్వర్యంలో.. సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులందజేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి

నెల్లూరులోని 19వ డివిజన్ కార్పొరేటర్ నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, జ్యోతిప్రియ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ముత్యాలపాలెంలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక మహిళలు దాదాపు 300 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం ముగ్గులు మాజీ మేయర్ భానుశ్రీ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీ కల్పన, రాజేశ్వరి, శ్రీవాణి గార్లు విచ్చేసి ముగ్గులు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 19వ డివిజన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారని, మన సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారని అన్నారు.

## ఆదర్శనీయులు.. స్వామీ వివేకానంద



పురస్కార గ్రహీతలను అభినందిస్తున్న ముఖ్యఅతిథులు

భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన ఆదర్శనీయులు స్వామి వివేకానంద అని, ఆ మహనీయుని ఆశయాల బాటలో అందరూ నడవాలని మాజీ ఐ.పి.ఎస్. అధికారి డాక్టర్ సి.ఎన్.గోపినాథ్‌రెడ్డి చెప్పారు. నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గానసభలో జరిగిన స్వామి వివేకానంద జయంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, వివేకానందుని బోధనలు ఆచరణీయమన్నారు. అనంతరం, స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డులను ఉన్నం వెంకటేశ్వర్లు, కుండా భాస్కర్, ఎస్.రామచంద్రరావు, ఆలియాభాను, డాక్టర్ వై.శ్రీనివాసబాబు, డాక్టర్ ఆమంచ అంజయ్య, దుబ్బా భాస్కర్, ఎల్.అనురుద్రరెడ్డి, ఎమ్.ఎస్.కె.షా, బత్తిన నరసింహులుగౌడ్, ఎమ్.డి.శ్రీనివాస్‌లకు ప్రదానం చేశారు.

## మాతృమూర్తి సేవా పురస్కారాలు

మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ (విశాఖపట్నం) వారు ఏటా నిర్వహిస్తున్న మాతృమూర్తి సేవా పురస్కారాలు-2026 ప్రదానోత్సవ కార్యక్రమం ఈనెల 13న ఆ ట్రస్ట్ ఛైర్మెన్ మేడా మస్తాన్ రెడ్డి స్వస్థలమైన అల్లూరులో జరిగింది. తల్లిని ప్రేమగా పోషిస్తున్న కుమారులు లేదా కుమార్తెలు 77 మందికి ఈ సంస్థ ఇప్పటివరకు ఈ పురస్కారాలనిచ్చి గౌరవించింది. తాజాగా, అల్లూరులోని సుబ్బయ్య బడిలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాసుల వెంకటేశ్వర్లు, ఇనమాల జీవరత్నం, ఆముదాలపల్లి యల మందయ్య, యాటగిరి సుబ్బయ్యలకు నిర్వాహకులు మాతృమూర్తి పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని పురస్కార స్వీకర్తలను అభినందించారు. జబర్దస్త్ అప్పారావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కుమారి మద్దూరు శ్రీవైష్ణవి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.




## లోకేష్‌తో నెల్లూరు నేతల భేటీ

తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్ష, కార్యదర్శులతో ఇటీవల ఉండవల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డిలు యువనేత నారా లోకేష్‌తో భేటీ అయ్యారు. పార్టీకి సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా వారు ఆయనతో చర్చించారు.

## 'సఖి' ప్రత్యేక వాహనం ప్రారంభం



'శఖి వన్‌స్టాప్' వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లాలో మహిళల భద్రత, సంక్షేమం మరియు న్యాయ సహాయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా 'సఖి వన్ స్టాప్ సెంటర్'కి కేటాయించిన ప్రత్యేక వాహనాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదుగా ఈనెల 12న ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికలు ఎదుర్కొనే హింస, వేధింపులు, వివక్ష వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ సేవలు అందించడంలో 'సఖి వన్ స్టాప్ సెంటర్' కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ వాహనం ద్వారా బాధితులకు తక్షణ చేరువ, కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సహాయం వంటి సేవలను వేగవంతంగా అందించవచ్చన్నారు. ఈ వాహనం జిల్లాలోని గ్రామీణ మరియు దూర ప్రాంతాలకు కూడా సులభంగా చేరుకుని, బాధితులకు అవసరమైన సహాయాన్ని సమయానికి అందించడంలో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.

## గణిత ఉపాధ్యాయునికి సన్మానం

**• కర్మయోగి కోర్సుల్లో 'చల్లా' ప్రతిభ**



సత్కారాన్నందుకుంటున్న చల్లా చంద్రశేఖర్‌రెడ్డి

కేంద్రప్రభుత్వం రూపొందించిన 'మిషన్ కర్మయోగి' కోర్సులను నిరంతరం అధ్యయనం చేస్తూ, అందులో 2,000 కోర్సులను ఇటీవలే పూర్తి చేసిన అనంతసాగరం మండలం చిలకలమర్రి జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్ రెడ్డి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. సోమవారం అనంతసాగరం మండల కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, ఎంఈఓ ప్రభాకర్ రెడ్డిలు ఆయన ప్రతిభను మెచ్చుకుంటూ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ కర్మయోగి'లో భాగంగా ఉద్యోగులందరూ ఈ కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి 2,000 కోర్సులు పూర్తిచేసి మండలానికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రామచంద్రయ్య, కళాధర్ శర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చిన్నబ్బాయి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇరుకళలమ్మ దేవాలయం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు చెరువుగట్టున వెలసివున్న సింహపురి గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయం క్యాలెండర్ ఆవిష్కరణ ఈనెల 11న జరిగింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆ క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. ఆలయఛైర్మెన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, కార్యనిర్వహణాధికారి గిరికృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 'సర్వేంద్రియానాం..నయనం ప్రధానం' అంటూ..

## గ్రామగ్రామాన 'విపిఆర్ నేత్ర' సేవలు



'విపిఆర్ నేత్ర' సేవలు వినియోగించుకుంటున్న గ్రామస్తులు

కంటిచూపు సరిగా లేని గ్రామీణప్రాంతాల ప్రజలకు 'విపిఆర్ నేత్ర' వెలుగురేఖగా మారుతోంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రారంభమైన 'విపిఆర్ నేత్ర' కార్యక్రమం గ్రామగ్రామాన ప్రజలకు కంటిచూపును ప్రసాదిస్తోంది. ఈ కార్యక్రమం తమ వాకిళ్ళ వద్దకే చేరువ కావడంతో ఎందరో వృద్ధులు సైతం దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఏడాది నవంబర్ 3న జిల్లాలోని మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం రామాపురం నుంచి ప్రారంభమైన ఈ నేత్ర సేవల యాత్ర ఇప్పటికి 3 మండలాల్లోని 55 పంచాయతీల్లో వైద్యబృందాల వారిచే కంటిపరీక్షలు పూర్తిచేయడం విశేషం. ఉదయగిరి నియోజకవర్గం లోని వరికుంటపాడు మండలంలో 24 పంచాయతీలు, ఉదయగిరి మండలంలో 17 పంచాయతీలు, సీతారామపురం మండలంలో 14 పంచాయతీల్లో విపిఆర్ నేత్ర సేవలు పూర్తయ్యాయి. ఈ మూడు మండలాల్లో మొత్తం 14,416 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన 8,234మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. సీతారామపురం మండలంలో 4153 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 2380 మందికి అద్దాలు ఇచ్చారు. విపిఆర్‌నేత్ర సేవలను అందుకునేందుకు పలువురు కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి కూడా రావడం విశేషం!

# పెన్నబద్వేలులో..నీటి సమస్య తీర్చండి

**• డీపీఓకి జనసేన వినతి**

కలువాయి మండలంలోని పెన్నబద్వేలులో నీటి సమస్య నెలకొందని, అధికారులు పరిశీలించి గ్రామస్తులకు తాగునీటి కొరత లేకుండా చూడాలని స్థానిక జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పి.మనోహర్ ఈనెల 10న కలువాయి మండలంలో పర్యటనకు వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి వసుమతికి వినతిపత్రం సమర్పించారు. జనసేన నాయకులు నరేష్, హరిప్రసాద్, రామ్‌కిషోర్, శ్రీరామ్ వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌ని..'విశ్వగురువు'గా నిలపాలి

**• స్వామి వివేకానంద జయంతిలో వక్తలు**



విజేతలకు బహుమతులందజేస్తున్న ముఖ్యఅతిథులు

స్వామి వివేకానంద సూక్తులు నేటి యువతకు ఆదర్శం కావాలని ఆత్మకూరు ఉప విద్యాశాఖ అధికారి ఎం.వి.జానకిరామ్ ఆకాంక్షించారు. సంగంలోని వికాస్ హైస్కూల్లో ఏబీఆర్‌ఎస్‌ఎం అనుబంధ సంస్థ..ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఇటీవల స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి పూర్వం ప్రపంచంలోని అనేక దేశాలు భారతదేశం పట్ల చులకన భావనతో ఉన్నప్పుడు స్వామి వివేకానంద ఇంగ్లాండ్, అమెరికా తదితర దేశాలలో పర్యటించి భారతదేశం యొక్క గొప్పతనాన్ని చాటారన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాలు అవుతున్న ప్రస్తుత తరుణంలో, 2047 కల్లా భారతదేశాన్ని వికసిత భారత్ లక్ష్యంగా, విశ్వగురువుగా నిలిపేందుకు స్వామి వివేకానంద బోధనలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం, వివేకానందుని బోధనలపై విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులందజేశారు. సంగం మండల విద్యాశాఖ అధికారి మల్లయ్య, ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి సురేంద్ర, సంగం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాము, ప్రభాకర్‌రెడ్డి అధ్యాపకులు నరసింహమూర్తి, నరసింహారెడ్డి, హరినాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కందమూరులో రైతులకు అవగాహన

నెల్లూరు రూరల్ మండలంలోని కందమూరులో ఇటీవల వ్యవసాయాధికారులు బి.శ్రీదేవి, నాగమోహన్ తదితరులు 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించి రైతులకు మెరుగైన వ్యవసాయ విధానాలను వివరించారు.సర్పంచ్ పెంచలనాయుడు పాల్గొన్నారు.

# తెలుగు భాషకు వన్నెలద్దుతున్న..ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

**• కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతులమీదుగా..8 గ్రంథాల ఆవిష్కరణ**





ఆవిష్కరించబడిన 8 గ్రంథాలు

***భారత పూర్వ ఉప రాష్ట్రపతి, సింహపురి ముద్దుబిడ్డ.. ముప్పవరపు వెంకయ్య నాయుడు చొరవతో నెల్లూరు సమీపంలోని వెంకటాచలంలో ఏర్పడిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం తెలుగు భాషకు సంబంధించి పలు పరిశోధనలు, గ్రంథాల ప్రచురణలతో తెలుగు సాహిత్యానికి మరింత వన్నెలద్దుతోంది. భారతీయ భాషా సంస్థ (మైసూరు) నిర్వహణలో ఉన్న ఈ కేంద్రం ప్రాచీన సాహిత్యం, అనువాదం, గ్రంథ పరిష్కరణ, కళలు తదితర అంశాల్లో గత కొంతకాలంగా చేస్తున్న కృషి అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇటీవల ఈ కేంద్రం తెలుగుభాషకి సంబంధించి 8 అమూల్య గ్రంథాలను ముద్రించడం, పలు గ్రంథాలను పరిష్కరించి ప్రచురించడం..ఆ గ్రంథాలను ఢిల్లీలోని కౌశల్‌భవన్‌లో ఈనెల 6వ తేదీన కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతులమీదుగా ఆవిష్కరించడం విశేషం. ఆ గ్రంథాల వివరాలిలా ఉన్నాయి.***

నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల తెలుగులో తొలి ఛందోగ్రంథం 'కవిజనాశ్రయము'నకు ఆచార్య వెంకటేశ్వర్లు రాసిన వ్యాఖ్యానం, ఆచార్య ఆర్వీయస్ సుందరం చేసిన ఆంగ్లానువాదం గ్రంథాలు ప్రచురితమయ్యాయి. అదేవిధంగా వినుకొండ వల్లభరాయుడు రచించిన 'క్రీడాభిరామము' గ్రంథానికి ఆచార్య ఎస్.జయప్రకాష్ తమిళానువాదం చేసిన గ్రంథం, తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారు రచించిన 'సంకీర్తన లక్షణము' అనే గ్రంథానికి డాక్టర్ గీతా నావన్ కన్నడ అనువాద గ్రంథం, తెలుగులో విశిష్టమైన కవితాప్రక్రియ 'చిత్రకవిత్వం'పై వైద్యం వేంకటేశ్వరాచార్యులు రచించిన 'చిత్రకవిత్వ దర్పణం' గ్రంథాలు ఈ ఎనిమిదింటిలో ఉన్నాయి. వీటితో పాటు, కంచి వీరశరభ కవి రచించిన 'హరిశ్చంద్రోపాఖ్యానము' గ్రంథాన్ని డాక్టర్ టి.ఎస్.వెంకటేష్ గ్రంథ పరిష్కరణ చేశారు. అలాగే నదురుపాటి వెంకన్న రచించిన 'మల్లు పురాణము', ధూర్జటి వెంకటరాయ కవి రచించిన 'రత్నావళి పరిణయము'లను డాక్టర్ కె.రమేశ్ గ్రంథ పరిష్కరణ చేశారు. ఈ మూడు గ్రంథాలు కూడా ప్రచురితమయ్యాయి. మొత్తంగా ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ప్రచురితమైన ఈ 8 గ్రంథాలను కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతీయ భాషల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఇలాంటి అమూల్యమైన ప్రాచీన గ్రంథాలను కేంద్రమంత్రి చేతులమీదుగా ఆవిష్కరించబడడం సంతోషంగా ఉందని ఈ గ్రంథ ముద్రణలకు సారథ్యం వహించిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ తెలిపారు. ఇంకా, కొరవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక', రఘునాథ నాయకుని 'వాల్మీకి చరిత్ర', తాళ్ళపాక తిమ్మక్క రచించిన 'సుభద్రా కళ్యాణం', అనంతామాత్యుని 'భోజరాజీయం', తరిగొండ వెంగమాంబ రచించిన 'శ్రీ వేంకటాచల మహత్యము', కేతన 'దశకుమార చరిత్ర', జక్కన 'విక్రమార్క చరిత్ర' తదితర కావ్యాలకు తమ కేంద్రంలోని విద్యాత్మక సిబ్బంది రాసిన వ్యాఖ్యాన గ్రంథాలు ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయని కూడా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యామంత్రిత్వ శాఖ ఉన్నత విద్యా కార్యదర్శి వినీత్ జోషి, సంయుక్త కార్యదర్శి మన్మోహన్‌కౌర్, భారతీయ భాషా సమితి ఛైర్మన్ కృష్ణశాస్త్రి, భారతీయ భాషా సంస్థ (మైసూరు) డైరెక్టర్ ప్రొఫెసర్ శైలేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### మల్లికార్జునపురంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు

తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం గ్రామంలో ఈనెల 11న ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు..యువనేత సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచనలతో గ్యాస్ కనెక్షన్లు లేని 30 పేద కుటుంబాలవారికి ఉచితంగా వాటిని పంపిణీ చేశామని టీడీపీ నాయకుడు తాళ్లూరి జీవరత్నం తెలిపారు.

### ముత్తుకూరులో హిందూ సమ్మేళనం

ముత్తుకూరులో ఈనెల 11న ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ గిరిజాకుమారి పాల్గొని హిందూ ధర్మం విశిష్టతను తెలియజెప్పారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి సుభాష్‌రెడ్డి, గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం కమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ధర్మప్రచారక్ సుధాకర్, డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ, బీజేపీ నాయకుడు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

### మర్రిపాడులో ఉచిత వైద్యశిబిరం

సంగం మండలం మర్రిపాడులో ఈనెల 11న ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కామాక్షయ్య, డాక్టర్ బాలిరెడ్డి, డాక్టర్ ఎంవి సుధాకర్, డాక్టర్ ఎం.జయరామయ్య, పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్ చేవూరు జనార్ధన్‌రెడ్డి, హరిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విడవలూరులో రక్తదాన శిబిరం

స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా విడవలూరులో ఈనెల 11న 'మన సేవ' సంస్థ, రెడ్‌క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో 55మంది పాల్గొని రక్తదానం చేశారు. 'మన సేవ' వ్యవస్థాపకులు దేవళ్ళ శ్రీనివాసులురెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యుడు తాతా గోపి, తాతా బాలకృష్ణ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

### కొత్తపాళెంలో వాలీబాల్ పోటీలు

ముత్తుకూరు మండలం కొత్తపాళెం గ్రామంలో ఈనెల 11న డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక వాలీబాల్ పోటీలు జరిగాయి. సర్వేపల్లి నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌బాబు ఈ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. పలువురు క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కావలిలో గిరిజన మహిళలకు చీరలు పంపిణీ

కావలి రూరల్ మండలం అన్నగారిపాలెంకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అలహరి వెంకయ్య, తన కుమార్తె రాజేశ్వరితో కలసి కావలి గిరిజన కాలనీలోని 50 మంది పేద మహిళలకు తమ సొంతనిధులు వెచ్చించి చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా వారు ఈ వితరణ చేపట్టారు. సంక్రాంతి పండుగకి అందరూ హాయిగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఓగిరాల సుధాకర్, రాంబాబు పాల్గొన్నారు.

### కోవూరు వద్ద రోడ్డు ప్రమాదం..వ్యక్తి మృతి

కోవూరు జాతీయరహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని, మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కొడవలూరు మండలం గండవరం గ్రామానికి చెందిన మోపర్తి వెంకటేశ్వర్లు(62) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమాచారం అందుకున్న ఎస్ఐ ముత్యాలరావు వెంటనే సంఘటనాస్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### దగదర్తిలో వేరుశనగ రైతులకు శిక్షణ

దగదర్తి వ్యవసాయ కార్యాలయంలో ఇటీవల వేరుశనగ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంట సాగులో తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి పెంచల్‌రాజు తదితరులు పర్యవేక్షించారు.

# కొత్త ఏడాదిన షార్.. బేజార్!

## గతి తప్పిన విజయాశ్వం.. పీఎస్ఎల్వి-సీ62 విఫలం




***అం**తరిక్ష రంగంలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఇస్రోకి..దిష్టి తగిలిందే ఏమో..ఈ కొత్తఏడాది ప్రారంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. నూతన సంవత్సరం ఆరంభమైన ఈ జనవరి నెలలో సరికొత్త రికార్డును సాధించి అంతరిక్షరంగంలో చరిత్ర సృష్టిస్తుందనుకున్న పీఎస్ఎల్వి సీ62 రాకెట్ ప్రయోగం ఉన్నట్లుండి సాంకేతిక అంతరాయానికి గురి కావడంతో ఇస్రో అవాక్కయింది. ఎన్నో విజయాలు సాధించి ఇస్రోకి పేరు తెచ్చిన విజయాశ్వం పీఎస్ఎల్వీ.. ఊహించనివిధంగా గతి తప్పడంతో.. ఒక్కసారిగా షార్ శాస్త్రవేత్తలు నిరాశకు లోనయ్యారు.*

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్నో రాకెట్ ప్రయోగాల్లో పీఎస్ఎల్వి సీరిస్ రాకెట్లే అత్యధికం. రివ్వుమంటూ నింగిలోకి దూసుకుపోయి విజయవంతంగా ఉప గ్రహాలని కక్ష్యలోకి చేర్చే అత్యంత శక్తివంత మైన రాకెట్లివి. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 2017లోనే ఒకేసారి 104 ఉప గ్రహాలను దిగ్విజయంగా కక్ష్యలోకి చేర్చి చరిత్ర సృష్టించిన రాకెట్లివి.అంతేకాదు, ఇస్రోకి ఘనకీర్తిని తెచ్చిన ఎన్నో ఉపగ్రహా లను, మంగళయాన్, చంద్రయాన్ వ్యోమ నౌకలను కూడా సునాయాసంగా నింగిలోని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చిన అపూర్వమైన రాకెట్లివి. అందుకే, పీఎస్ఎల్వీ రాకెట్లంటే ఇస్రోకి నమ్మినబంటు లాంటివి. అవలీ లగా అనుకున్న కక్ష్యకు చేరి, లక్ష్యాన్ని సాధించే రాకెట్లంటే మన పీఎస్ఎల్వీ రాకెట్లే. కానీ, ఈసారి కొత్త ఏడాది ప్రారం భంలో సాంకేతిక అంతరాయంతో ఆ రాకెట్ గురి తప్పడం విచారకరం.

### 3వ దశ చివరలో అంతరాయం :

నిర్ణయించిన సమయం ప్రకారం శ్రీహరికోటలోని షార్ నుంచి ఈనెల 12వ తేదీ ఉదయం 10.18గంటలకు పీఎస్ ఎల్వీ–సీ62 రాకెట్ నింగిలోకి దూసుకు పోయింది. దేశరక్షణకి ఎంతో కీలకమైన ఈఓఎస్–ఎన్1(అన్వేష్) అనే ఉపగ్రహంతో పాటు, వివిధ దేశాలకి చెందిన మరో 15 చిన్న ఉపగ్రహాలని కూడా మోసుకుని అంతరిక్షంలో పయనిస్తోంది. అయితే, మూడో దశ చివరలో ఎదురైన సాంకేతిక లోపంతో రాకెట్ గతి తప్పింది. నిర్దేశించిన కక్ష్యకు చేరకుండా పక్కకి వెళ్ళిపోయింది. హటాత్తుగా నియంత్రణ కోల్పోయి.. ఆ 16 ఉపగ్రహాలని కక్ష్యలో ప్రవేశ పెట్టలేకపోయింది. దీంతో ఈ ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మెన్ నారాయణన్ అధికారికంగా ప్రకటించారు. ఎక్కడ లోపం జరిగిందో విశ్లేషించి త్వరలోనే వివరాలు తెలియజేస్తామన్నారు.

### 64 ప్రయోగాల్లో..60 విజయాలు

రాకెట్‌లోని సాంకేతిక లోపంతో ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరకపోవడంతో ఆ ఉపగ్రహాలకి తీరని నష్టం వాటిల్లినట్లే. భూ పరిశీలన కోసం పంపిన 'అన్వేష్' ఉపగ్రహంతో సహా, వివిధ దేశాలకి చెందిన మిగిలిన 15 ఉపగ్రహాలు కూడా కక్ష్యలోకి చేరలేకపోయాయి. పీఎస్ఎల్వీ రాకెట్ విఫలం కావడం అందరికీ విస్మయం కలిగించింది. ఇప్పటికి ఈ సీరీస్ ద్వారా 64 ప్రయోగాలు జరిగితే, అందులో 60 విజయవంతమయ్యాయి. గతంలో రెండుసార్లు 1993, 2017 సంవత్సరాల్లోనూ..ఇప్పుడు 8నెలల కాలంలోనే 2025 మే 18న ఒకసారి, ఇప్పుడు తాజాగా (2026 జనవరి 12) జరిగిన పిఎస్ఎల్వి రాకెట్ ప్రయోగం కూడా గురితప్పిన ప్రయోగాల జాబితాలో చేరిపోయింది.

### అపజయాలే విజయ సోపానాలుగా

రాకెట్ ప్రయోగాలు సాంకేతికపరంగా ఎంతో కీలకమైనవి. విజయాలతో పాటు వైఫల్యాలూ ఉంటూనే ఉంటాయి. ఎంతో అప్రమత్తంగా ఉన్నా..ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా చాలు..పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. గతంలోనూ ఇస్రోకి ఇలాంటి అనుభవాలున్నాయి. అయితే, కొంత సమయం పట్టవచ్చు గానీ.. అపజయాలను గుణపాఠాలుగా తీసుకుని, అన్ని లోపాలను త్వరలోనే సరిదిద్దుకుని అంతులేని ఆత్మవిశ్వాసంతో ఇస్రో తిరిగి విజయాల దిశగా పయనిస్తుందనడంలో సందేహం లేదు.

## సాయుధ దళాల సంక్షేమ నిధికి..
## 5.07 లక్షల విరాళం



స్వయం సేవక సంఘాల వారిని అభినందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

దేశ సేవలో ఎన్నో త్యాగాలు చేస్తూ నిరంతరం శ్రమిస్తున్న సైనికులు మరియు మాజీ సైనికుల సంక్షేమం కోసం జిల్లా లోని మహిళా స్వయం సేవక సంఘాలు విరాళాలు సేకరించి సాయుధ దళాలకి చేయూతనందించాయి. నెల్లూరు, కావలి, ఆత్మకూరు, బుచ్చిరెడ్డి పాళెం, కందుకూరు (నేటి ప్రకాశం జిల్లా)కి చెందిన పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సాయుధ దళాల సంక్షేమ నిధికి సేకరించిన రూ.5,07,216 చెక్కును ఇటీవల జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక్ బోర్డు ఛైర్మన్ హిమాన్షు శుక్ల ద్వారా జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణకు అంద జేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ లీలారాణి ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి ప్రశంసా పత్రం, షీల్డ్‌లు ఇచ్చి అభినందించారు.

## 31వ వర్ధంతి



జననం 08-11-1930

నిర్యాణం 18-01-1995

## స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారు



జర్నలిజం వ్యాపారం కాకూడదు..
జర్నలిస్టులు క్యాపిటలిస్టులుగా మారకూడదు.
అలా జరిగిన రోజున ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే
నాలుగు స్తంభాలలో ఓ మూలస్తంభం కూలిపోయినట్టే!

- కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి
వ్యవస్థాపకులు, లాయర్

**మహనీయుని మహాత్మకు మా నివాళి.**

లాయర్ సిబ్బంది    కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com